నేటి కందం- నేటికి అందం

ముందరి తరమున నిలచిన
సుందర హృదయులను వారి శుభగుణ తతులన్
బృందములుగ తలచుకొనుచు
నందరు జరుపగ వలె సకలాత్మల దినమున్ !!

(నవంబరు 2 ప్రపంచ సక లాత్మల దినం..)

-రాధశ్రీ
సెల్:9494481210

నేటి నిజం

తెలుగు దినపత్రిక

చురక

ప్రశ్నించే గొంతుకల
ప్రజాస్వామ్య జనవాదం
అర్బన్ నక్సలిజం
అంటే కాదా అపవాదం
ప్రశ్నకు బదులివ్వని
ప్రభుత్వాల వైఫల్యం
అక్కసుగా అణిచివేస్తే
అవగలదా సాఫల్యం

-వేల్పుల నారాయణ
9440433475

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 2-11-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :31 సంచిక:72 పేజీలు:6 వెల: రూ.1/-

బోడుప్పల్‌లో అభివృద్ధి పనులకు మంత్రి, ఎంపీ శ్రీకారం

హైదరాబాద్, నవంబర్ 1:మేడ్చల్ నియోజకవర్గంలోని బోడుప్పల్ మున్సిపల్ కార్పోరేషన్ లో జిల్లా ఇన్చార్జి మంత్రి శ్రీధర్ బాబు, ఎంపీ ఈటల రాజేందర్ లు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. బోడుప్పల్ మున్సిపల్ కార్పోరేషన్ లో జిల్లా ఇన్చార్జి మంత్రి శ్రీధర్ బాబు, ఎంపి ఈటల రాజేందర్, తెలంగాణ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డిలు పర్యటించారు. రూ. 7కోట్ల అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రజల బాగు కోసం తాము ప్రాధాన్యత ఇవ్వనున్న ముఖ్యమైన పనులు ఇవని అన్నారు. 7వ డివిజన్ గాయత్రి నగర్ లో సీసీ రోడ్డు, 20వ డివిజన్ చిలకనగర్ లో డ్రైనేజీ లైన్ పనులు, అంబేద్కర్ విగ్రహం వద్ద తాగునీటి పైప్ లైన్ల ఏర్పాటు, ఇతర ముఖ్యమైన రోడ్డు పనులు, ఈ ప్రాజెక్టులు బోడుప్పల్ అభివృద్ధిలో కీలక మైలురాళ్ళుగా నిలుస్తాయని తెలిపారు. ఈ సమావేశంలో మేయర్ అజయ్ యాదవ్, కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్ కోకు రూ.4791 కోట్ల సబ్సిడీ నిధులు విడుదల

హైదరాబాద్ నవంబర్ 1 (ఎక్స్ ప్రెస్ న్యూస్).:: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సబ్సిడీ నిధులను ట్రాన్స్ కోకు మంజూరు చేసింది. రూ. 4791 కోట్ల సబ్సిడీ నిధులను తాజాగా విడుదల చేసింది. 2024 నవంబర్ నుంచి 2025 మార్చి వరకు సబ్సిడీ నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

సచివాలయ బందోబస్తు బాధ్యతలు చేపట్టిన ఎస్పీఎఫ్

హైదరాబాద్, నవంబర్ 1: సచివాలయం బందోబస్తు బాధ్యతలను తెలంగాణ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్పీఎఫ్) శుక్రవారం స్వీకరించింది. మొత్తం 214 మంది ఎస్పీఎఫ్ సిబ్బంది రక్షణ బాధ్యతలను చేపట్టారు. సచివాలయ భద్రత పర్యవేక్షణ అధికారిగా దేవిదాస్ నియమితులయ్యారు. ఆయన ఆధ్వర్యంలో ఇవాళ సచివాలయ ఆవరణలో పూజలు నిర్వహించి బందోబస్తు బాధ్యతలను చేపట్టారు.

గతంలో సచివాలయానికి ఎస్పీఎఫ్ బలగాలే బందోబస్తు నిర్వహించేవి. కొత్త సచివాలయం నిర్మించిన తర్వాత ఆ బాధ్యతను స్పెషల్ పోలీసులకు (టీజీఎస్పీ) అప్పగించారు. అయితే ఇటీవల ఏక్ పోలీస్ విధానం అమలు కోసం టీజీఎస్పీ కానిస్టేబుళ్లు, వారి కుటుంబాలు ధర్నాలు చేస్తుండటంతో ప్రభుత్వం ఉలిక్కిపడింది. ముఖ్యమంత్రి నివాసం, కార్యాలయం, సచివాలయం వద్ద విధుల్లో ఉన్న టీజీఎస్పీ కానిస్టేబుళ్లు ధర్నా చేస్తే అటు పరువు పోవడంతోపాటు ఇటు భద్రతకు ముప్పు కలుగుతుందని ప్రభుత్వం భావించింది. వెంటనే టీజీఎస్పీని పక్కకు తప్పించింది. మొదట సీఎం నివాసం, ఇంటివద్ద రక్షణను ఎస్పీఎఫ్‌కు అప్పగించింది. తాజాగా సచివాలయాన్ని సైతం ఎస్పీఎఫ్ పరిధిలోకి తీసుకెళ్లింది.

బీఆర్ఎస్ హయాంలో విద్య వ్యవస్థ నాశనమైంది

-మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క

హైదరాబాద్ నవంబర్ 1 (ఎక్స్ ప్రెస్ న్యూస్).:: బీఆర్ఎస్ హయాంలో విద్య వ్యవస్థ నాశనమైందని పంచాయతీరాజ్ గిరిజన అభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క విమర్శలు చేశారు. విద్యా శాఖకు కేసీఆర్ ప్రభుత్వం చేసింది శూన్యమని విమర్శించారు. విద్యార్థుల బాధలు తెలిసిన రేవంత్ రెడ్డి సీఎంగా ఉన్నారని తెలిపారు. విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉండాలనే లక్ష్యంతో రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని ఉద్ఘాటించారు.అందుకే ఎన్నడు లేని విధంగా హాస్టల్, గురుకుల విద్యార్థులకు డైట్ కాస్మోటిక్ 40శాతం పెంచారని గుర్తుచేశారు. ఇవాళ(శుక్రవారం) తెలంగాణ సచివాలయంలో మంత్రి సీతక్క మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ... చరిత్రలో ఎన్నడూ లేని విధంగా విద్యార్థులకు 40శాతం చార్జీలను పెంచిన సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. డైట్ చార్జీలు ఏడేళ్లుగా, కాస్మోటిక్ చార్జీలు గత 16 సంవత్సరాలుగా పెరగలేదని అన్నారు. ఏడు సంవత్సరాల క్రితం డైట్ చార్జీలు కొంచెం పెంచి.. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రచారం చేసుకుందని మంత్రి సీతక్క మండిపడ్డారు.ఏడేళ్లుగా ధరలు విపరీతంగా పెరిగాయని.. అందుకు అనుగుణంగా డైట్, కాస్మోటిక్ ఛార్జీలు ఎందుకు పెంచలేదని ప్రశ్నించారు. డైట్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచకపోవడంతో పిల్లలు అర్ధాకలితో ఇబ్బందులు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్లు కేసీఆర్ అధికారంలో ఉండి టాయిలెట్స్ కట్టలేదని..తాగునీరు, మౌలిక వసతులు కల్పించలేదని ధ్వజమెత్తారు. ఈ సమస్యలను గుర్తించిన సీఎం రేవంత్ రెడ్డి పాఠశాలల్లో మౌలిక సదుపాయల కల్పన కోసం ప్రత్యేక దృష్టి పెట్టారని మంత్రి సీతక్క అన్నారు.డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచడంతో 7.65 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి జరగనుందని వివరించారు.పిల్లలకు కడుపునిండా భోజనం పెట్టాలని పెరిగిన ధరలకు అనుగుణంగా డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచిన సీఎం రేవంత్‌రెడ్డికు ధన్యవాదాలు తెలిపారు. ఇక హాస్టల్ విద్యార్థులు అర్ధాకళితో అవస్థలు పడాల్సిన అవసరం లేదని చెప్పారు. పెంచిన చార్జీలతో విద్యార్థులకు పోషకాహారం అందించాల్సిన బాధ్యత టీచర్లది, హాస్టల్ సిబ్బందిది అని తెలిపారు. హాస్టల్ విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ చార్జీలు గ్రీన్ ఛానల్ ద్వారా చెల్లిస్తామని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు.

నూరు శాతం ఖచ్చితత్వంతో సమగ్ర సర్వేను పక్కాగా చేపట్టాలి

- రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎం దాన కిషోర్

హైదరాబాద్, నవంబర్ 1 (ఎక్స్ ప్రెస్ న్యూస్).:: నూరు శాతం ఖచ్చితత్వంతో సామాజిక, ఆర్థిక,విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే సమగ్రంగా చేపట్టాలని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎం దాన కిషోర్ సూచించారు. ఖైరతాబాద్ జోన్ లో చేపట్టనున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పై శుక్రవారం సూపర్ వైజర్ లు, ఎన్యూమరేటర్లకు బంజారాహిల్స్ లోని గౌరీశంకర్ కమ్యూనిటీ హాల్ లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య కార్యదర్శి ఎం. దానకిషోర్ మాట్లాడుతూ... నవంబర్ 6 నుంచి ప్రారంభమయ్యే సర్వేలో వివిధ వర్గాల ప్రజల సామాజిక, ఆర్థిక పరిస్థితులను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తగా నమోదు చేయాలన్నారు. గ్రేటర్ పరిధిలో సర్వేను చేపట్టేందుకు 21 వేల మంది ఎన్యూమరేటర్లను వినియోగించు కుంటున్నామన్నారు. ఆర్పీ లను కూడా సర్వే లో భాగం చేశామన్నారు. సర్వేను పకడ్బందీగా చేపట్టేందుకు ప్రతి 10 మంది ఎన్యూమరేటర్లకు ఒక సూపర్ వైజర్ ను నియమించామని చెప్పారు.ఏమైనా సందేహాలు ఉంటే సూపర్ వైజర్ లను సంప్రదించి నివృత్తి చేసుకోవాలన్నారు. సమగ్ర సర్వే ద్వారా ప్రభుత్వ పథకాలు చిట్టచివరి పేదవారికి చేరేందుకు దోహద పడతాయని పేర్కొన్నారు. సర్వే వివరాలు నిక్కచ్చిగా నమోదు చేసేందుకు వీలుగా క్షేత్ర స్థాయిలో సర్వే చేపట్టే ముందు ప్రతి ఎన్యూమరేటర్ జిరాక్స్ సర్వే పత్రాలతో ప్రాక్టీసు చేసేలా చూడాలని, అప్పుడే వారికి పూర్తి అవగాహన వస్తుందని మున్సిపల్ అధికారులకు ఈ సందర్భంగా ముఖ్య కార్యదర్శి సూచించారు.కార్యక్రమంలో అదనపు కమిషనర్ (లేక్స్) కె.శివకుమార్ నాయుడు, జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రి, కూతురు మృతి.. మృతదేహాలను కవర్లలో కట్టి ఈడ్చిన పోలీసులు



గౌహతి, నవంబర్ 1: రోడ్డు ప్రమాదంలో తండ్రి, కూతురు మరణించారు. అయితే పోలీసులు చాలా అమానుషంగా ప్రవర్తించారు. వారి మృతదేహాలను ప్లాస్టిక్ కవర్లలో కట్టి రోడ్డుపై ఈడ్చుకెళ్లారు. ఇది చూసి అక్కడున్న వారు షాక్ అయ్యారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. అస్సాంలోని దర్రాంగ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది.

నందిత అనే యువతి గౌహతి యూనివర్శిటీలో మొదటి సెమిస్టర్ చదువుతున్నది. అక్టోబర్ 30న తండ్రి మధుర నాథ్ దేకా స్కూటర్‌పై యూనివర్సిటీకి వెళ్లాడు. కుమార్తె నందితను ఎక్కించుకుని సిపజార్‌లోని ఇంటికి వెళ్తున్నాడు.

అయితే రాత్రి వేళ మంగళ్దోయ్ ప్రాంతంలోని జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని వారి స్కూటర్ ఢీకొట్టింది. దీంతో తండ్రీకుమార్తెలు రోడ్డుపై పడ్డారు. ఇంతలో వేగంగా వచ్చిన మరో లారీ వారి మీదుగా దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో వారిద్దరూ అక్కడికక్కడే మరణించారు.

కాగా, రోడ్డు ప్రమాదం గురించి తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. తండ్రీకుమార్తెల మృతదేహాలను ఒక ప్లాస్టిక్ కవర్‌లో కట్టారు. పోస్ట్‌మార్టం కోసం తరలించేందుకు దూరంలో ఉన్న వాహనం వద్దకు వారి మృతదేహాలను రోడ్డుపై ఈడ్చుకెళ్లారు. ఇది చూసి అక్కడున్న జనం షాక్ అయ్యారు.

మరోవైపు ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ నేపథ్యంలో అస్సాం పోలీసుల తీరుపై విమర్శలు వెల్లువెత్తాయి. రోడ్డు ప్రమాదంలో మరణించిన తండ్రీకుమార్తెల మృతదేహాలను ప్లాస్టిక్ కవర్‌లో కట్టి రోడ్డుపై ఈడ్చిన అమానవీయ చర్యపై నెటిజన్లు మండిపడ్డారు. దీంతో అస్సాం డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) జీపీ సింగ్ దీనిపై స్పందించారు. ఆ పోలీస్ అధికారులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

దీపావళి వేడుకల్లో పాల్గొన్న ఆస్ట్రేలియా ప్రధాని ఆల్బనీస్

న్యూఢిల్లీ, నవంబర్ 1: ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ ఆల్బనీస్ ఇవాళ దీపావళి వేడుకల్లో పాల్గొన్నారు. దీపావళి సందర్భంగా ఆయన ఆలయాన్ని విజిట్ చేశారు. బందీ చోర్ దివస్ సందర్భంగా కూడా ఆయన తలకు పాగా కట్టుకుని గురుద్వారా వెళ్లారు. ఆరెంజ్ రంగు టర్బన్ ధరించిన ఆయన ఫోటోలను షేర్ చేశారు. సిడ్నీ శివారు ప్రాంతమైన గ్లెన్‌వుడ్‌లో ఉన్న గురుద్వారాకు ప్రధాని ఆల్బనీస్ వెళ్లారు. అక్కడ ఆయన కొత్త కిచెన్‌ను ప్రారంభించారు. గురుద్వారా సభ్యులతో ఆల్బనీస్ ఫోటోలకు ఫోజులిచ్చారు.

భక్తులతో ఆయన సెల్ఫీలు దిగారు. సిడ్నీలోనే ఉన్న మురుగన్ ఆలయాన్ని కూడా ఆయన విజిట్ చేశారు. ఆస్ట్రేలియాలోని తమిళ కమ్యూనిటీతో ఆయన దీపావళి వేడుకల్లో పాల్గొన్నారు. మురుగన్ ఆలయానికి ప్రతి రోజు ఎంతో మంది విజిట్ చేస్తుంటారని, దక్షిణ ఆసియా హిందూ కమ్యూనిటీకి ఇది ముఖ్య ఆలయమైందని తన ఎక్స్ అకౌంట్‌లో ప్రధాని అల్బనీస్ పోస్టు చేశారు.

శాంతిని నెలకొల్పటంలో పీస్ వెల్ఫేర్ కమిటీ సభ్యుల పాత్ర కీలకం

- హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్

హైదరాబాద్ నవంబర్ 1 (ఎక్స్ ప్రెస్ న్యూస్).;:: హైదరాబాద్ నగరంలో శాంతిని నెలకొల్పటంలో పీస్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు కీలక రోల్ పోషిస్తున్నారని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ వ్యాఖ్యానించారు. ఇవాళ(శుక్రవారం) బంజారాహిల్స్‌లోని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో నగరంలోని అన్ని జోన్‌ల నుంచి వచ్చిన సెంట్రల్ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై సీవీ ఆనంద్ చర్చించారు. ఇటీవల నగరంలో జరిగిన సున్నిత, మతపరమైన సమస్యలపై వరస్పరంగా చర్చించడానికి సమావేశాన్ని నిర్వహించినట్లు తెలిపారు.శాంతి భద్రతలను పరిరక్షించడానికి, స్థానిక పోలీసులకు సహకరించాలని కోరారు. హైదరాబాద్ ఖ్యాతిని కాపాడేందుకు పీస్ వెల్ఫేర్ కమిటీ సభ్యుల అవిశ్రాంత కృషిని కొనసాగించాలని కోరారు. పీస్ వెల్ఫేర్ కమిటీలో యువతకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. అనంతరం ముగింపు కార్యక్రమంలో పీస్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. హైదరాబాద్ సిటీ పోలీసులకు మద్దతుగా ఉంటూ రాబోయే పండుగలను శాంతియుత వాతావరణంలో జరిగే విధంగా చూడాలని కోరారు.సమాజంలోని సంఘ వ్యతిరేక కార్యకలాపాలు నిర్మూలించడానికి, ప్రజల్లో సామరస్య భావం, ఐక్యత నెలకొల్పే విధంగా కమ్యూనిటీ వర్క్‌షాప్‌లను నిర్వహిస్తామని కమిటీ ప్రతిజ్ఞ చేసింది. పీస్ వెల్ఫేర్ కమిటీ, పోలీసుల మధ్య సత్సంబంధాలను మెరుగుపరుచుకోవాలని అన్నారు, ఏదైనా శాంతి భద్రతల సమస్య వచ్చినప్పుడు ఈ పీస్ వెల్ఫేర్ కమిటీ సభ్యుల ద్వారా సమస్యను సులువుగా పరిష్కరించవచ్చని తెలిపారు. వివిధ మత సమూహాల మధ్య అవగాహన, సహకారాన్ని పెంపొందించే లక్ష్యంతో కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్ కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు.అలాగే శాంతిని నెలకొల్పటానికి నివారణ చర్యలో భాగంగా పీస్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు విద్యా సంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. సమాజంలో ఉద్రిక్తతలను పెంచే తప్పుడు సమాచారం, పుకార్లతో జరిగే ప్రభావాలపై అవగాహన పెంచే విధంగా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.ఈ మధ్య నగరంలో కొంతమంది వ్యక్తుల చెడు చేష్టలతో కలిగిన దుష్పరిణామాలపై, పీస్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు అందరు కలిసి ఏకగ్రీవంగా ఖండించారు. కార్యక్రమంలో విక్రమ్ సింగ్ మాన్, ఐపీఎస్, అడిషనల్ సీపీ, ఒడూ, హైదరాబాద్, సెంట్రల్ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ పీ. విశ్వ ప్రసాద్, ఐపీఎస్ అడిషనల్ సీపీ , ట్రాఫిక్, హైదరాబాద్ సిటీఎస్. చైతన్య కుమార్, ఐపీఎస్ డీసీపీ, స్పెషల్ బ్రాంచ్ హైదరాబాద్ సిటీ, కమిటీ వైస్ చైర్మన్ స్నేహ మెహ్రా, ఐపీఎస్, డీసీపీ సౌత్ జోన్, హైదరాబాద్ సిటీ, కమిటీ కోఆర్డినేటర్ నగరంలోని ఒడూ, ట్రాఫిక్, ౫, టాస్క్‌ఫోర్స్, హెడ్ క్వార్టర్స్, ట్రైనింగ్, ౫ఓఎం, హైదరాబాద్ సిటీ డీసీపీలు, కిషన్ శర్మ, సెంట్రల్ పీస్, వెల్ఫేర్ కమిటీ జనరల్ సెక్రటరీ, హఫీజ్ ముజాఫర్ హుస్సేన్, ఇతర ఆఫీస్ బేరర్లు, సుమారు 350 శాంతి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ సోదరుడు, ఎమ్మెల్యే డీఎస్ రాణా మృతి

న్యూఢిల్లీ, నవంబర్ 1: కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ సోదరుడు, సీనియర్ బీజేపీ నేత, నగరోటా ఎమ్మెల్యే దేవేందర్ సింగ్ రాణా ఇవాళ మృతిచెందారు. హర్యానాలోని ఫరీదాబాద్ ప్రైవేటు ఆస్పత్రిలో ఆయన తుదిశ్వాస విడిచారు. ఆయన వయసు 59 ఏళ్లు. ఆయనకు భార్య, ఇద్దరు కూతుళ్లు, ఓ కుమారుడు ఉన్నారు. డీఎస్ రాణా మృతి వార్త వ్యాపించగానే జమ్మూలోని గాంధీనగర్ ఏరియాలో ఉన్న ఆయన ఇంటి వద్దకు భారీ సంఖ్యలో ప్రజలు చేరుకున్నారు. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ కూడా హుటాహుటిన బయలుదేరి వెళ్లారు.

జమ్మూలోని దోగ్రా కమ్యూనిటీ తరపున దేవేందర్ సింగ్ గట్టి స్వరాన్ని వినిపించారు. రాజకీయాల నుంచి బడా వ్యాపారవేత్తగా ఆయన ఎదిగారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నగ్రోటా నియోజకవర్గం నుంచి దేవేందర్ సింగ్ రాణా ఎన్నికయ్యారు. రెండోసారి ఆయన ఆ సీటును సొంతం చేసుకున్నారు. సోదరుడి మరణం పూడ్చలేనిదని, వ్యక్తిగతంగా తనకు నష్టం జరిగినట్లు కేంద్ర మంత్రి జితేంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా కూడా సంతాపం ప్రకటించారు.

ఆర్థిక సలహా మండలి చైర్మెన్ బిబేక్ మృతి పట్ల ప్రధాని మోదీ సంతాపం

న్యూఢిల్లీ, నవంబర్ 1:ప్రధాని నరేంద్ర మోదీ ఆర్థిక సలహా మండలి చైర్మెన్ బిబేక్ డెబ్రోయ్ ఇవాళ కన్నుమూశారు. ఆయన వయసు 69 సంవత్సరాలు. పద్మశ్రీ అవార్డు గ్రహీత అయిన బిబేక్ డెబ్రోయ్.. గతంలో పుణెలోని గోఖలే ఇన్స్టిట్యూట్ ఆఫ్ పాలిటిక్స్ అండ్ ఎకనామిక్స్ కు ఛాన్సలర్‌గా చేశారు. ఉదర సంబంధిత వ్యాధి వల్ల ఇవాళ ఉదయం ఏడు గంటలకు బిబేక్ డెబ్రోయ్ మృతిచెందినట్లు ఢిల్లీ ఎయిమ్స్ డాక్టర్లు ప్రకటన జారీ చేశారు. బిబేక్ మృతి పట్ల ప్రధాని మోదీ సంతాపం తెలిపారు. ఆయనో గొప్ప పండితుడు అని పేర్కొన్నారు. ఆర్థికశాస్త్రం, చరిత్ర, సంస్కృతి, రాజకీయం, ఆధ్యాత్మికత లాంటి భిన్నమైన రంగాల్లో నిష్ణాతుడు అని తెలిపారు. ప్రజల శ్రేయస్సు కోసం ఆయన పనిచేశారని, ప్రాచీన సాహిత్యంపై పర్మ్ చేశారని, దాన్ని నేటితరం యువతకు అందుబాటులోకి తెచ్చినట్లు వెల్లడించారు. బిబేక్ డెబ్రోయ్ అత్యద్భుతమైన విద్యావేత్త అని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ తెలిపారు.

ఏపీలో కూటమి ప్రభుత్వ కుట్రకు పోలవరం బలి : మాజీ మంత్రి అంబటి

అమరావతి, నవంబర్ 1: కూటమి ప్రభుత్వం కుట్రతో ఏపీకి జీవనాడిగా ఉన్న పోలవరం ప్రాజెక్టు బలి కాబోతుందని వైసీపీ నాయకుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆరోపించారు. తాడేపల్లి వైసీపీ కార్యాలయంలో శుక్రవారం మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు సీఎం అయ్యాక పోలవరానికి విఘాతం కలుగుతుందని, ఆ ప్రాజెక్టుకు ఉరి ఖాయమని అన్నారు.

గతంలో చంద్రబాబు పోలవరం ప్రాజెక్టు డయాఫ్రమ్ వాల్‌ను సరైన విధానంగా నిర్మించక పోలవరం పనులు పూర్తికాలేదని అన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పోలవరాన్ని గాడిలో పెట్టామని పేర్కొన్నారు. మళ్లీ చంద్రబాబు అధికారంలోకి రావడంతో పోలవరాన్ని పాతర వేయనున్నాడని ఆరోపించారు. పక్క రాష్ట్రాల ఒత్తిడితో పోలవరం ఎత్తు తగ్గిస్తున్నారని దుయ్యబట్టారు.

తెలంగాణలో మరో రెండురోజులు వానలే.. ఐఎండీ హెచ్చరిక

హైదరాబాద్, నవంబర్ 1: తెలంగాణలో రాగల రెండు, మూడురోజులు వానలు కొనసాగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. నైరుతి బంగాళాఖాతం, దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరంలో ఉపరితల ఆవర్తనం సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తు నుంచి 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు కొనసాగుతుందని పేర్కొంది. రాష్ట్రంలో శుక్రవారం పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వానలు పడే అవకాశం ఉందని పేర్కొంది.

మంచిర్యాల, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్క వానలు పడే అవకాశాలున్నాయని పేర్కొంది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఐఎండీ ఎల్లో అలెర్ట్‌ని జారీ చేసింది. ఈ నెల 4 వరకు రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని అంచనా వేసింది. ఆ తర్వాత రాష్ట్రంలో పొడి వాతావరణం ఏర్పడుతుందని వివరించింది. ఇదిలా ఉండగా.. గడిచిన 24 గంటల్లో మంచిర్యాల, ములుగు, జయశంకర్, మెదక్, సంగారెడ్డి, సిరిసిల్ల, సిద్దిపేట, కామారెడ్డితో పాటు పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాపాతం నమోదైంది.

జర్నలిజం అంటే ఓ మహత్తర భాధ్యత.. !

(02 నవంబర్ "జర్నలిస్టులకు వ్యతిరేకంగా నేరాలకు శిక్షార్హతను అంతం చేసే అంతర్జాతీయ దినం" సందర్భంగా)

జర్నలిజం అంటే ఓ గొప్ప బాధ్యత. జర్నలిస్టు అంటే వాస్తవాలను వెలిసి తీసి ప్రజల ముందుంచే దూత. జర్నలిజం అంటే అక్రమాలకు చెక్ పెట్టే వేదిక. అలాంటి పవిత్రమైన జర్నలిజం వృత్తి ప్రమాదకరంగానే కాకుండా ప్రాణాంతకంగా కూడా మారుతున్నది. జర్నలిస్టులపై హత్యాయత్నాలు, ఆన్‌లైన్ వేధింపులు, బెదిరింపులు, హింస, క్రమంగా పెరుగుతున్నాయి. జర్నలిస్టులపై జరిగిన బహిరంగ నేరాలకు సహితం శిక్షలు పడడం లేదు లేదా విచారణలు ఏండ్ల తరబడి కొనసాగుతూనే ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా 2006-24 మధ్య 1,700 జర్నలిస్టులు హత్య చేయబడ్డారు. వీరిలో 10 శాతం కేసులు కూడా శిక్షలు ఖరారు కాలేదు. నవంబర్ 2009లో ఫిలిప్పీన్స్‌కు చెందిన 'మాగ్విందనావో లేదా అంపటువాన్ ఊచకోత'లో 32 మంది జర్నలిస్టులు/మీడియా కార్యకర్తలు హత్య చేయబడడం ఓ భయంకర రక్త చరిత్ర. 02 నవంబర్ 2013లో ఇద్దరు ఫ్రెంచ్ జర్నలిస్టులు కూడా హత్య చేయబడ్డారు. ఇలాంటి ఘటనలు ప్రపంచవ్యాప్తంగా ప్రతి రోజు జరుగుతూనే ఉన్నాయి.

జర్నలిస్టులు భద్రంగా పని చేస్తున్నారా !

జర్నలిస్టులపై జరిగుతున్న ఇలాంటి పలు భయానక విషయాలన్నింటినీ అధ్యయనం చేసిన ఐరాస 2013లో భావ ప్రకటనా స్వేచ్ఛకు పట్టం కడుతూ 02 నవంబర్‌న ప్రతి ఏటా "జర్నలిస్టులకు వ్యతిరేకంగా నేరాలకు శిక్షార్హతలను అంతం చేసే అంతర్జాతీయ దినం (ఇంటర్నేషనల్ డే టు ఎండ్ ఇంప్యూనిటీ ఫర్ క్రైమ్స్ అగెనెస్ట్ జర్నలిస్ట్స్)" పాటించుట ఆనవాయితీగా మారింది. ఈ ఏడాది 2024 థీమ్‌గా "సంక్షోభాలు, అత్యవసర పరిస్థితుల్లో జర్నలిస్టుల భద్రత" అనే అంశాన్ని తీసుకొని అవగాహన కల్పిస్తున్నారు.

2వ అతి పెద్ద ప్రింట్/ఎలక్ట్రానిక్ మీడియాగా భారతం:

1780లో "బెంగాల్ గెజిట్" అనబడే తొలి పత్రికను కొల్‌కతాలో ప్రారంభించారు. భారత్‌లో 500లకు పైగా శాటలైట్ చానెల్స్, 70,000లకు పైగా వార్తా పత్రికలు, 3 కోట్లకు పైగా కాపీల సర్కులేషన్లతో రెండవ అతి పెద్ద (చైనా తర్వాత) న్యూస్ పేపర్ మార్కెట్‌తో అనునిత్యం సమాచారాన్ని వితరణ చేసేతున్నారు. 2014 నుంచి నేటి వరకు భారత్‌లో 28 మంది వృత్తి నిబద్ధత కలిగిన జర్నలిస్టుల హత్యలు నమోదు అయ్యాయి. పర్యావరణ/మైనింగ్/ఇసుక మాఫియా/ అన్వేషణాత్మక కథనాలకు సంబంధ జర్నలిస్టులు అధికంగా అక్రమార్కుల చేతుల్లో పట్ట పగలే హత్యలకు గురి అవుతున్నారు.

జర్నలిస్టు పెన్నును నొక్కి పడితే అక్రమార్కుల ఆటలకు అంతు ఉండదు. ప్రపంచంలో ఏ మూల ఏ రహస్యం జరిగిన క్షణాల్లో జర్నలిస్టులు పసిగట్టి బహిర్గత పరచడం చూస్తున్నాం. ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్టులు అత్యంత సాహసంతో వాస్తవాలను కళ్ల ముందుంచడానికి ఎంతో శ్రమ పడతారు. దుర్మార్గుల మోసాలను పసిగట్టిన జర్నలిస్టులను హత్య చేయడానికి కూడా మాఫియా వెనకాడడం లేదు. 4వ ఎస్టేట్‌గా భావించబడే జర్నలిజం నేడు పలు సవాళ్లను ఎదుర్కొంటూ కొనసాగుతున్నది. నీతి నిజాయితీ, నైతికత కలిగిన సమాజ నిర్మాణానికి జర్నలిస్టులు ప్రధాన భూమికను నిర్వహిస్తున్నారు. ఇలాంటి విలేకరుల వృత్తి నిబద్ధతకు సలాం చేస్తూ, వారిని ప్రోత్సహిద్దాం, సముచితంగా గౌరవిద్దాం.

– డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

వైరాగ్యం కు సాహితీ సేవా రత్న పురస్కారం

వైరాగ్యంను సన్మానించిన మహర్షి వాల్మీకి సాంస్కృతిక సేవా సంస్థ

హైదరాబాద్, నవంబర్ 1:ఆదికవి, కవికోకిల మహర్షి వాల్మీకి జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్ లోని శ్రీ త్యాగరాయ గానసభ మెయిన్ హాల్లో మహర్షి వాల్మీకి సాంస్కృతిక సేవా సంస్థ వారు అక్టోబర్ 30, బుధవారం రోజు సాయంత్రం నిర్వహించిన వేడుకల్లో కరీంనగర్ జిల్లాకు చెందిన కవి, రచయిత, విమర్శకులు అర్ధశతాధిక పుస్తకాల సంకలన కర్త వైరాగ్యం ప్రభాకర్ ను సాహితీ సేవా రత్న బిరుదునందించి, అభినందన ప్రశంసా జ్ఞాపికతో ఘనంగా సన్మానించారు.

కవిగా, రచయితగా పలు ప్రక్రియల్లో పన్నెండు పుస్తకాలు ప్రచురించి, 50 కి పైగా కవితా,కథా, వ్యాస సంకలనాలు తన సంపాదకత్వంలో వెలువరించి, సాహిత్య రంగంలో ఎంతోమంది కవులను ప్రోత్సహిస్తూ చేస్తున్న సాహిత్య సేవను గుర్తించి ఈ అవార్డును అందించినట్లు సంస్థ వ్యవస్థాపకులు ,రిటైర్డ్ డైరెక్టర్ గనులు భూగర్భ శాఖ వి.డి.రాజగోపాల్ తెలిపారు. అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారా యణ, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షులు పద్మశ్రీ డా.కొలకలూరి ఇనాక్, కళారత్న బిక్కి కృష్ణ చేతులమీదుగా ఈ అవార్డును అందుకున్న వైరాగ్యం ప్రభాకర్ ను కరీంనగర్ జిల్లాకు చెందిన పలువురు ప్రముఖులు, కవులు, సాహితీవేత్తలు అభినందించారు.

కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ జే.పీ. నడ్డా నాయకత్వంలో 'జాతీయ ఐక్యతా' ప్రతిజ్ఞ

న్యూఢిల్లీ, నవంబర్ 1:'జాతీయ ఏక్తా దివస్' కు (జాతీయ ఐక్యత దినోత్సవానికి) ముందు రోజైన అక్టోబరు 30న ఢిల్లీ లోని నిర్మాణ్ భవన్‌లో కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ జగత్ ప్రకాశ్ నడ్డా నాయకత్వంలో ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది కలిసి దేశ ఏకత, సమగ్రతలను బలపరచడానికి తోడ్పడతామంటూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి శ్రీ ప్రతాప్‌రావ్ జాదవ్, కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి శ్రీమతి పుణ్య సలిల శ్రీవాస్తవ కూడా పాల్గొన్నారు. దేశాన్ని ఏకం చేయడంలో కీలక పాత్ర పోషించిన సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ దార్శనికతను, నాయకత్వాన్ని గౌరవించుకోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

అందరినీ కలుపుకొని, సమాజాన్ని పురోగమన పథంలో ముందుకు తీసుకుపోవడంలో 'జాతీయ ఐక్యత'కు ప్రాముఖ్యాన్ని ఇవ్వాల్సి ఉందని కేంద్ర ఆరోగ్య మంత్రి శ్రీ నడ్డా ఈ కార్యక్రమంలో వివరించారు. "సర్దార్ పటేల్ అంకితం చేసుకొన్న ఏకత, సమగ్రత సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటాం అని మనం ఈ రోజు మరోసారి స్పష్టం చేద్దాం. భారతదేశాన్ని అద్వితీయంగా నిలబెడుతున్న సమ్మిళితత్వం, వైవిధ్యాల స్ఫూర్తికి మనం చేసే పనులు అద్దం పట్టేటట్లు చూసుకోవడం మనందరి ఉమ్మడి బాధ్యత" అని కేంద్ర మంత్రి అన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న వారంతా ఒక ప్రతిజ్ఞ పాఠాన్ని చదివారు. మన దేశంలోని విభిన్న సంస్కృతులను, భాషలను, సంప్రదాయాలను 'ఐక్యతా బంధం'లో పెనవేసేందుకు పాటుపడతామనేదే ఆ ప్రతిజ్ఞ సారాంశం.

ప్రజారోగ్యాన్ని మెరుగు పరచాలన్న తన ఆశయంతో పాటు కేంద్ర ఆరోగ్య శాఖ తాను అమలు చేస్తున్న అన్ని కార్యక్రమాల్లోనూ ఐక్యత, సమానత్వ సిద్ధాంతాలకు పెద్దపీట వేయడానికి కట్టుబడి ఉంది.

బీఎస్ఎన్ఎల్ స్వదేశీ 4జి సేవల ప్రారంభంతో దేశంలోనిమారుమూల ప్రాంతాలకు కూడా అందుబాటులోకి వచ్చిన హై-స్పీడ్ సేవలు

న్యూఢిల్లీ, నవంబర్ 1:దేశంలో డిజిటల్ అనుసంధానాన్ని మెరుగుపరచాలన్న లక్ష్యానికి అనుగుణంగా భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) దేశవ్యాప్తంగా 50,000కు పైగా ప్రాంతాలకు స్వదేశీ 4జి సేవలను విస్తరించింది. ప్రభుత్వ 'ఆత్మ నిర్భర్ పథకం' ద్వారా ఈ ఘనత సాధ్యమయ్యింది. దేశీయ సాంకేతికత దేశ అనుసంధాన అవసరాలను తీర్చగలదని నిరూపించిన ఈ విజయంలో బీఎస్ఎన్ఎల్ కు టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), తేజస్ నెట్వర్క్స్, సెంటర్ ఫర్ డెవలప్మెంట్ ఆఫ్ టెలీమాటిక్స్ (సీ-డాట్), ఐటీఐ వంటి ప్రముఖ సంస్థలు సహకారం అందించాయి. సాంకేతికతపరంగా, సంపూర్ణ దేశీయ రూపకల్పన, అభివృద్ధి, కార్యాచరణ వల్ల, బీఎస్ఎన్ఎల్ 4జి సేవలు ''పూర్ణ స్వదేశీ'' ఆశయాన్ని ప్రతిబింబిస్తూ, భారత్ టెలికాం రంగంలో నూతన అధ్యాయానికి తెర తీశాయి.

అక్టోబర్ 29 నాటికి, బీఎస్ఎన్ఎల్ సుమారు 50,000 ప్రాంతాల్లో సేవల్ని అందించాలని భావించగా, ఇప్పటికే 41,000 ప్రాంతాల్లో సేవలు ప్రారంభమయ్యాయి. వీటిల్లో, ఎచీ.2 దశ కింద 36,747 కేంద్రాలను నెలకొల్పగా, డిజిటల్ భారత్ నిధి ఫండ్ (ఒకప్పటి యూఎస్ఓఎఫ్) సహకారంతో 5,000 ప్రాంతాల్లో 4జి సాచ్యురేషన్ ప్రాజెక్టులను నెలకొల్పారు. మొత్తం 1,00,000 4జి సైట్లు నెలకొల్పాలన్న బీఎస్ఎన్ఎల్ లక్ష్యానికి, సేవల శీఘ్రతర ప్రారంభం బలాన్నిస్తోంది. వేగంగా విస్తరిస్తున్న బీఎస్ఎన్ఎల్ సేవా వ్యవస్థకు తాజా పరిణామాలు ఉదాహరణగా నిలుస్తున్నాయి.

బీఎస్ఎన్ఎల్ సంస్థ ఈ ఏడాది జూలై నాటికి 15,000 ప్రాంతాలకు తన సేవలను విస్తరించింది. గత మూడు మాసాల్లో, మరో 25,000 ప్రాంతాలకు 4జి సేవల్ని విస్తరించింది. యావత్తు దేశాన్నీ అనుసంధించాలన్న బీఎస్ఎన్ఎల్ నిబద్ధతకూ, స్వదేశీ సాంకేతికత ప్రభావానికీ ఈ విస్తరణ తార్కాణంగా నిలుస్తోంది.

దేశ ఐక్యతకు ముప్పుగా ఉన్న అనేక సమస్యలను గడిచిన పదేళ్లలో మేం పరిష్కరించాం

న్యూఢిల్లీ, నవంబర్ 1:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు గుజరాత్‌లోని కేవడియాలో ఐక్యతా మూర్తి (స్టాచ్యూ ఆఫ్ యూనిటీ) వద్ద నిర్వహించిన జాతీయ ఐక్యతా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ప్రధాని పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా స్థానికులతో కలిసి ఐక్యతా ప్రమాణం చేశారు. ప్రతి యేటా వల్లభాయ్ పటేల్ జయంతి రోజున జరుపుకొనే జాతీయ ఐక్యతా దినోత్సవంలో భాగంగా నిర్వహించిన, ఐక్యతా దినోత్సవ పరేడ్‌ను ప్రధానమంత్రి ప్రత్యక్షంగా వీక్షించారు.

''సర్దార్ సాహెబ్ చెప్పిన శక్తిమంతమైన మాటలు... ఐక్యతా మూర్తి వద్ద జరుగుతున్న ఈ కార్యక్రమం... ఏక్తా నగర్ విశాల దృశ్యం... ఇక్కడ నిర్వహించిన అద్భుతమైన ప్రదర్శనలు... మినీ ఇండియా గురించిన అవలోకనం... ప్రతీదీ చాలా అద్భుతంగా ఉంది... ఇది స్ఫూర్తిదాయకంగా ఉంది" అని ప్రధానమంత్రి పేర్కొన్నారు. జాతీయ ఐక్యతా దినోత్సవం సందర్భంగా దేశ ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపిన ఆయన... ఆగస్టు 15, జనవరి 26 తేదీల మాదిరిగానే... ఈనాటి ఈ కార్యక్రమం యావద్దేశానికి నూతన శక్తిని అందిస్తుందన్నారు.

దీపావళి సందర్భంగా మన దేశంలో, ప్రపంచవ్యాప్తంగా నివసిస్తున్న భారతీయులందరికీ ప్రధానమంత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఈసారి జాతీయ ఐక్యతా దినోత్సవం దీపావళి పండుగతో పాటు ఐక్యతా పండుగను జరుపుకొనే అద్భుతమైన యాదృచ్ఛికతను తీసుకువచ్చిందన్నారు. "దీపావళి, దీపాల మాధ్యమం ద్వారా మొత్తం దేశాన్ని కలుపుతుంది. మొత్తం దేశానికి వెలుగునిస్తుంది. ఇప్పుడు ఈ దీపావళి పండుగ భారతదేశాన్ని ప్రపంచంతో కలుపుతోంది" అని ప్రధానమంత్రి ఉద్ఘాటించారు.

నేటి నుంచి సర్దార్ పటేల్ 150వ జయంతి సంవత్సరం ప్రారంభమవుతున్నందున ఈ ఏడాది ఏక్తా దివస్ మరింత విశిష్టమైనదని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. రాబోయే రెండేళ్ల పాటు, దేశం సర్దార్ పటేల్ 150వ జయంతి వేడుకలు ఘనంగా జరుపుకొంటుదన్నారు. దేశ ఐక్యత కోసం ఆయన చేసిన అపూర్వ కృషికి ఇది దేశం ఆయనకు అందించే నివాళి అవుతుందని పేర్కొన్నారు. ఈ రెండేళ్ల వేడుకలు ఒకే భారతదేశం, గొప్ప భారతదేశం (వన్ ఇండియా, గ్రేట్ ఇండియా) కోసం మన సంకల్పాన్ని మరింత బలపరుస్తాయని ప్రధానమంత్రి ఉద్ఘాటించారు. అసాధ్యాన్ని సైతం సుసాధ్యం చేయవచ్చని ఈ సందర్భం మనకు నేర్పుతుందన్నారు.

దురాక్రమణదారులను తరిమికొట్టేందుకు ఛత్రపతి శివాజీ మహారాజ్ అందరినీ ఎలా ఏకం చేశారో శ్రీ నరేంద్ర మోదీ వివరించారు. మహారాష్ట్రలోని రాయ్‌గఢ్ కోట ఇప్పటికీ ఆ కథను చెబుతోందన్నారు. రాయ్‌గడ్ కోట సామాజిక న్యాయం, దేశభక్తి, దేశానికి తొలి ప్రాధాన్యం వంటి విలువలతో కూడిన పుణ్యభూమిగా ప్రధానమంత్రి అభివర్ణించారు. "ఛత్రపతి శివాజీ మహారాజ్ రాయ్‌గఢ్ కోటలో ఒక ప్రయోజనం కోసం దేశంలోని విభిన్న ఆలోచనలనూ ఏకం చేశారన్నారు. ఈ రోజు ఇక్కడ ఏక్తా నగర్‌లో, రాయగఢ్‌లోని ఆ చారిత్రాత్మక కోట ప్రతిష్ఠను మనం చూస్తున్నాం.... ఈ నేపథ్యంలో, అభివృద్ధి చెందిన భారత్ సంకల్ప సాధన కోసం మనం ఇక్కడ ఏకమయ్యాం" అని ప్రధానమంత్రి అన్నారు.

గత దశాబ్ద కాలంలో ఐక్యత, సమగ్రతను బలోపేతం చేయడంలో భారత్ అద్భుతమైన విజయాలను సాధించిన తీరును ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. ఏక్తా నగర్, ఐక్యతా మూర్తి స్ఫూర్తితో నేడు ప్రభుత్వం చేసే ప్రతీ పనిలో దేశ నవైక్యత స్పష్టంగా కనిపిస్తుందన్నారు. దేశవ్యాప్తంగా గ్రామాల నుంచి సేకరించిన ఇనుము, మట్టితో నిర్మితమైన ఈ స్మారక చిహ్నం పేరులోనే కాకుండా దాని నిర్మాణంలో కూడా ఐక్యతను సూచిస్తుందని తెలిపారు. ఏక్తా నగర్‌లో గల ఏక్తా నర్సరీలో ప్రపంచంలోని చాలా అడవుల నుంచి తెచ్చిన మొక్కలు ఉన్నాయనీ, అందుకే ఇది విశ్వవనంగా ఉందన్నారు. దేశవ్యాప్తంగా ఆరోగ్యకరమైన ఆహారాన్ని ప్రోత్సహించే పిల్లల పోషకాల పార్కు, వివిధ ప్రాంతాల ఆయుర్వేద వైద్య విధానాలను గురించి అవగాహన కలిగించే ఆరోగ్య వనం, దేశవ్యాప్తంగా తయారైన హస్త కళలను ప్రదర్శించే ఏక్తా మాల్ ఇక్కడ ఉన్నాయని ప్రధానమంత్రి వివరించారు.

దేశ ఐక్యత కోసం చేసే ప్రతీ ప్రయత్నాన్నీ వేడుకలా జరుపుకోవడం నిజమైన భారతీయులుగా మనందరి కర్తవ్యమని ప్రధానమంత్రి ఉద్బోధించారు. మరాఠీ, బెంగాలీ, అస్సామీ, పాళీ, ప్రాకృత భాషలకు శాస్త్రీయ హోదా కల్పించడంతోపాటు, నూతన జాతీయ విద్యా విధానంలో భారతీయ భాషలకు ప్రాధాన్యమివ్వడం వృత్తిపరమైన కోర్సులకు ప్రాధాన్యతనివ్వడం వంటి అంశాలను ప్రధానమంత్రి వివరించారు. బోడో ఒప్పందం అస్సాంలో 50 ఏళ్ల ఘర్షణలను రూపుమాపడం అలాగే బ్రూ-రియాంగ్ ఒప్పందం వేలాది మంది వలసదారులను స్వదేశానికి తిరిగి వచ్చేలా చేయడం గురించి ప్రధానంగా ప్రస్తావించారు. నక్సలిజం ప్రభావాన్ని తగ్గించడంలో సాధించిన విజయాన్నీ ప్రస్తావించిన ప్రధానమంత్రి... భారతదేశ ఐక్యత, సమగ్రతకు ప్రధాన సవాలుగా దానిని అభివర్ణించారు. నిరంతర ప్రయత్నాల కారణంగా.. నక్సలిజం ఇప్పుడు అంతిమదశకు చేరిందన్నారు.

నేడు దూరదృష్టి, దిశ, దృఢ సంకల్పం గల భారతదేశాన్ని మనం చూస్తున్నామని ప్రధానమంత్రి పేర్కొన్నారు. భారత్ నేడు బలమైన, సమగ్రత గల దేశంగా ఉందనీ, ఇది సున్నితమైనదే అయినా అప్రమత్తంగా ఉంటుందనీ అలాగే మర్యాదగా ఉంటూనే అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నదన్నారు. ఇది బలం, శాంతి రెండింటి ప్రాముఖ్యతను అర్థం చేసుకుంటుందన్నారు. ప్రపంచ అశాంతి మధ్య భారతదేశం వేగవంతమైన అభివృద్ధిని, బలాన్ని కొనసాగిస్తూ శాంతికి దీపస్తంభంగా నిలున్తున్నదని ప్రధానమంత్రి ప్రశంసించారు. ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో వివాదాల మధ్య, "భారత్ ప్రపంచానికే మిత్రదేశంగా మారింది" అని ఆయన పేర్కొన్నారు. భారత్ సాధించిన పురోగతిని చూసి కొన్ని శక్తులు ఇబ్బంది పడుతున్నాయనీ, దేశ ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీయడం, దేశాన్ని విభజించడం లక్ష్యంగా పనిచేస్తున్నాయని పేర్కొంటూ... ఐక్యత, అప్రమత్తతో అలాంటి వారిని ఎదుర్కోవాలని ఆయన స్పష్టం చేశారు. ఇలాంటి విభజనవాదుల కుట్రలను గమనిస్తూ జాతీయ ఐక్యతను కాపాడాలని ఆయన భారతీయులకు విజ్ఞప్తి చేశారు.ప్రధానమంత్రి తన ప్రసంగాన్ని ముగిస్తూ... సర్దార్ పటేల్‌ను ఉటంకిస్తూ, దేశం ఐక్యతకు కట్టుబడి ఉండాలని కోరారు. "భారతదేశం వైవిధ్యంతో నిండిన భూమి అని మనం గుర్తుంచుకోవాలి. భిన్నత్వాన్ని ఐకమత్యంతో వేడుకలా జరుపుకోవడం ద్వారానే ఏకత్వం బలపడుతుంది." "రాబోయే 25 ఏళు ఐక్యత విషయంలో చాలా ముఖ్యమైనవి. మనం ఈ ఐక్యతా మంత్రాన్ని బలహీనపరచకూడదు. వేగవంతమైన ఆర్థికాభివృద్ధికి, సామాజిక సామరస్యానికి ఇది అవసరం. నిజమైన సామాజిక న్యాయం కోసం, ఉద్యోగాల కోసం, పెట్టుబడుల కోసం ఇది అవసరం" అని తెలిపారు. భారతదేశ సామాజిక సామరస్యం, ఆర్థికాభివృద్ధి, ఐక్యత పట్ల నిబద్ధతను బలోపేతం చేయడం కోసం ప్రతి పౌరుడు కృషి చేయాలని ప్రధానమంత్రి పిలుపునిచ్చారు.

అధికారులపై హోం మంత్రి వంగలపూడి అనిత గరంగరం

-పాత వాసనలు వీడాలని హితవు
-సస్పెండ్ చేసే విధంగా ప్రవర్తించవద్దు
-పాయకారావుపేటో ఉచిత గ్యాస్ పథకాన్నిప్రారంభించిన అనిత

అమరావతి, నవంబర్ 1: అధికారుల్లో ఇంకా పాత వాసన ఉందని, వెంటనే దానిని విడనాడాలని సూచించారు హోం మంత్రి

వంగలపూడి అనిత.. తాను ఎక్కడ ఉన్నా.. ఏ అధికారి ఎలా పని చేస్తున్నారో డేటా ఉంటుందని తెలిపారు. తాను ఎప్పుడు అధికారులను సస్పెండ్ చేసే విధంగా చర్యలు తీసుకోలేదని.. అలాంటి పరిస్థితిని తీసుకురాకండని అధికారులకు సూచించారు. అధికారులు తప్పు చేస్తే ఉపేక్షించేంది లేదని అన్నారు. ఎవ్వరైనా అధికారులు అవినీతి చేస్తే తక్షణమే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అనకాపల్లి జిల్లా పాయకరావుపేట పట్టణంలో పంచాయితీ రాజ్ ప్రభుత్వ గెస్ట్ హౌస్ వద్ద మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీని అనిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నామని అన్నారు. ఈ క్రమంలో ప్రధాని మోడీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

గత ఐదు సంవత్సరాలుగా గ్యాస్ పొయ్యి వెలిగించాలి అంటే మహిళలు భయపడేవారని పేర్కొన్నారు. గతంలో గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగి ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు.. అప్పటిలో మహిళల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని చంద్రబాబు దీపం పథకం ప్రవేశపెట్టారని అనిత అన్నారు. ఇప్పుడు మరల దీపం-2 పథకం ప్రవేశపెట్టి, మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నామని తెలిపారు.

రాష్ట్ర ఖజనాలో ప్రస్తుతం డబ్బులు జీరో అని హోంమంత్రి అనిత పేర్కొన్నారు. త్వరలో పాయకరావుపేటలో అన్నా క్యాంటీన్ ప్రారంభిస్తామని చెప్పారు. పాయకరావుపేట నియోజకవర్గంలో తాము వేసిన రోడ్లు తప్ప ఒకరోడ్డు వేయలేదని ఆరోపించారు. త్వరలో పాయకరావుపేటలో డబుల్ రోడ్డు వేస్తాం.. పాయకరావుపేటకు ఒక గుర్తింపు తీసుకువస్తామని అనిత అన్నారు. వైసీపీ పాలనలో గ్రామ సర్పంచ్‌లకు చేతులకు సంకేళ్ళు వేశారని దుయ్యబట్టారు. ఎన్డీయే ప్రభుత్వంలో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని హోంమంత్రి అనిత తెలిపారు.

నవంబర్ 5న నిర్వహించే ప్రజాభిప్రాయ సేకరణకు హాజరై అభిప్రాయాలు తెలపాలి: జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

నవంబర్ 5న ఖమ్మం కలెక్టరేట్ సమావేశమందిరంలో బిసికమీషన్ ప్రతినిధుల బృందంచే ప్రజాభిప్రాయ సేకరణ

ఖమ్మం, నవంబర్ 1: (నేటినిజం ప్రతినిధి):నవంబర్ 5న ఉదయం 10గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బిసికమీషన్ ప్రతినిధుల బృందంచే నిర్వహించు ప్రజాభిప్రాయ సేకరణలో ఉమ్మడి ఖమ్మం(ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం) జిల్లాలకు చెందిన ఆయా రాజకీయ పార్టీలు, సంఘాలు, ప్రజలు పాల్గొని తమ అభిప్రాయాలను తెలపాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన, అవసరమైన రిజర్వేషన్ల దామాషాను పేర్కొనే విషయంలో కమీషన్ చైర్మన్ నిరంజన్ నేతృత్వంలో సభ్యులు రాపోలు జయప్రకాష్,తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి, బిసివెల్ఫేర్ కమీషనర్లతో కూడిన బృందం ప్రజాభిప్రాయ సేకరణ చేయనున్నట్లు, అభిప్రాయాలు తెలియజేయాలను కునేవారు రాతపూర్వక సమర్పణలు, అభ్యర్థనల ను నిర్దేశిత నమూనాలో వెరిఫికేషన్ అఫిడవిట్ ఆరు సెట్లను తెలుగు లేదా ఆంగ్ల భాషలో ఇవ్వాల్సి ఉంటుందని, వారి వాదనలకు మద్దతుగా వారి వద్ద ఉన్న సమాచారం, మెటీరియల్, సాక్ష్యాలను, సంబంధిత కేసుల వివరాలను పేర్కొంటూ, సమర్పణలు, అభ్యర్థనలు, సలహాలు, ఆక్షేపణలను కమీషన్ కు నివేదించవచ్చని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం ప్రారంభించిన చంద్రబాబు



అమరావతి, నవంబర్ 1:ఏపీ సీఎం చంద్రబాబు దీపం 2.0 పథకాన్ని నేడు ప్రారంభించారు.. దీనిలో భాగంగా శ్రీకాకుళం జిల్లాలోని ఈదుపురంలో లబ్దిదారు ఇంటికి వెళ్లి దీపం 2.0 పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండరు అందజేశారు. స్వయంగా టీ కాచిన సీఎం.. వారి కష్టసుఖాలు తెలుసుకున్నారు. ఇక ఈ దీపం 2.0 పథకంలో భాంగా నాలుగు నెలలకోసారి ఉచిత సిలిండర్ అందిస్తారు.

సిలిండరు ఇంటికి చేరిన 48 గంటల్లోగా వినియోగదారు ఖాతాలో రాయితీ జమ అవుతుంది. లబ్దిదారులు ముందుగా గ్యాస్ సిలిండర్ ధర చెల్లించాల్సి ఉంటుంది..

ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకోండి : డిప్యూటీ సీఎం పవన్

-అభివృద్ధి పథంలో పయనించండి..
-ఐ.ఎస్. జగన్నాధపురం గ్రామంలో దీపం పథకాన్ని ప్రారంభించిన పవన్
-లబ్ధిదారులకు గ్యాస్ సిలిండర్ల పంపిణీ
-గ్రామ సమస్యలను అడిగి తెలుసుకున్న పవన్
-శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో పవన్ పూజలు
-పవన్ తో వెన్నెల తల్లిదండ్రులు భేటీ
-వేధింపులతో ఆత్మహత్య చేసుకున్న వెన్నెల
-న్యాయం చేయాలని పేరెంట్స్ వేడుకోలు
-తగిన న్యాయం చేస్తానని భరోసా

తిరుపతి, నవంబర్ 1:తమ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని నేటి నుంచి అమలు చేస్తున్నట్లు ప్రకటించారు డిప్యూటీ చీఫ్ మినిస్టర్ పవన్ కల్యాణ్.. ద్వారకా తిరుమల మండలం, ఐ.ఎస్. జగన్నాధపురం గ్రామంలో మహిళలకు దీపం-2 పథకం కింద ఇవాళ జరిగిన ఉచిత గ్యాస్ సిలెండర్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన

లబ్ధిదారులకు తొలి విడత గ్యాస్ సిలిండర్లను అందజేశారు..

అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన గ్రామ సభకు హాజరైన మహిళలతో ముఖాముఖిగా మాట్లాడారు.. గ్రామస్థులకు ఇప్పటి వరకు అందుతున్న వివిధ పథకాల వివరాలను వారి నుంచి అడిగి తెలుసుకున్నారు పవన్.. ఇదే సమయంలో గ్రామంలోని పలు సమస్యలను పవన్ దృష్టికి తెచ్చారు మహిళలు.. దీంతో అక్కడే ఉన్న పంచాయితీ రాజ్ అధికారులను పిలిచి ఆ సమస్యలను పరిష్కరించవలసింది గా ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకుని అభివృద్ధి పథంలో పయనించాలని కోరారు..

శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో పవన్ పూజలు..

అంతకు ముందు పవన్ కల్యాణ్ ఏలూరు జిల్లాలోని ఐఎస్ జగన్నాథపురంలో పర్యటించారు. ఉదయం రాజమండ్రి విమానాశ్రయానికి చేరుకున్న పవన్ అక్కడి నుంచి కారులో ఐఎస్ జగన్నాథపురానికి చేరుకున్నారు. గ్రామంలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ యాగశాలలో నిర్వహించిన ధన్వంతరి హోమంలో పాల్గొన్నారు.

పవన్ తో వెన్నెల తల్లిదండ్రులు భేటి..

పదోతరగతి విద్యార్థి వెన్నెల తల్లిదండ్రులు మధురపూడి విమానాశ్రయంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కలిశారు. తమ కుమార్తె విషయాన్ని పవన్ దృష్టికి వెన్నెల కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు. వెన్నెల ఆత్మహత్యకు పాఠశాల యాజమాన్యమే కారణమని తల్లిదండ్రులు ఆరోపించారు. తమకు న్యాయం చేయాలంటూ పవన్ ను వేడుకున్నారు.. ఈ విషయంలో తప్పక న్యాయం చేస్తానని వారికి భరోసా ఇచ్చారు.

అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చెముడులంకకు చెందిన వెన్నెల సెలవు రోజుల్లో పాఠశాల నిర్వహిస్తున్నారని డీఈఓకి ఫిర్యాదు చేసింది. విషయం తెలిసిన స్కూల్ కరెస్పాండెంట్ వెన్నెలను మందలించాడు. పదో తరగతి నువ్వు ఎలా పాస్ అవుతావో చూస్తానని బెదిరించాడు. దాంతో వెన్నెల ఆత్మహత్య చేసుకుంది. ఫిర్యాదు చేసిన పాపానికి పదో తరగతి నువ్వు ఏ రకంగా పాస్ అవుతావో చూస్తానని కరెస్పాండెంట్ బెదిరించిన కారణంగా వెన్నెల ఆత్మహత్య చేసుకుందని పవన్ కల్యాణ్ దృష్టికి ఆమె కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు. పవన్ ద్వారా తమకు న్యాయం జరుగుతుందని వెన్నెల కుటుంబ సభ్యులు ఆశాభావం వ్యక్తం చేశారు. శ్రీ షిరిడి సాయి విద్యానికేతన్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు పవన్ ను కోరారు.

వ్యాన్ బోల్తా.. 15మంది కూలీలకు గాయాలు

అమరావతి, నవంబర్ 1:శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నియోజకవర్గం సోంపేట మండలంలో కూలీ పనులు చేసేందుకు వ్యాన్ పై వెళ్తుండగా బారువా రైల్వే గేట్ సమీపంలో వ్యాన్ బోల్తా పడడడంతో వ్యాన్ లో ప్రయాణిస్తున్న 15మంది కూలీలకు తీవ్ర గాయాలైనట్లు బారువ ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

శుక్రవారం కంచిలి మండలం పూర్ణ శాసనం గ్రామానికి చెందిన 15మంది దినసరి కూలీలు బారువా సమీపంలో జరుగుతున్న రోడ్ల పనులు చేసేందుకు బొలెరో వ్యాన్ పై వెళుతుండగా ప్రమాదవశాత్తు వ్యాన్ బోల్తా పడడంతో ఒక మహిళ చేయి తెగిపోవడంతో పాటుగా 12మందికి స్వల్ప గాయాలు, మరో ఇద్దరు పరిస్థితి విషమంగా ఉన్నట్లు బారువ పోలీసులు తెలిపారు.

క్షతగాత్రులకు బారువ ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. పూర్తి స్థాయి వివరాలు తెలియజేస్తుంది. జరిగిన సంఘటనపై బారువ ఎస్సై చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కల్లూరుగూడలో ఎమ్మెల్యే సంప్రదాయ పూజలు

ఆదిలాబాద్, నవంబర్ 1:దీపావళి పండుగను పురస్కరించుకొని శుక్రవారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడుమ బోజ్జు పటేల్ ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలోని స్వగ్రామమైన కల్లూరుగూడలో కుటుంబ సమేతంగా సంప్రదాయ పూజలు చేశారు. సంప్రదాయంగా పశువులకు మొక్కు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, బంధువులు పాల్గొన్నారు.

త్వరపడండి! దేశంలోని వర్ధమాన విజువల్ ఎఫెక్ట్స్ (విఎఫ్ఎక్స్) కళాకారులకు ఇదొక సువర్ణావకాశం

న్యూఢిల్లీ, నవంబర్ 1:మీలో సృజనాత్మకత ఉందా... ఆకట్టుకునేలా కథ చెప్పగలరా! "డైలీ లైఫ్ సూపర్ హీరో" ఇతివృత్తానికి 30 సెకన్ల 'విజువల్ ఎఫెక్ట్స్ (విఎఫ్ఎక్స్) క్లిప్'తో జీవం పోయగల సామర్థ్యం ఉందా? అయితే, ఆకర్షణీయ బహుమతులతోపాటు రూ.5 లక్షల విలువైన వస్తువులు, ప్రత్యేక స్టూడియో ఇంటర్న్‌షిప్ వంటివి గెలుచుకోండి. అంతేగాక వృత్తి నిపుణులుగా ఎదిగే అవకాశం మీకు దక్కుతుంది. ఇందులో భాగంగా తగిన శిక్షణ ఇవ్వడంతోపాటు వచ్చే ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించే అంతర్జాతీయ 'ప్రపంచ ఆడియో విజువల్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్'లో నిపుణుల సమక్షాన మీ సృజనాత్మక ప్రతిభా ప్రదర్శనకు వీలు కల్పిస్తారు. దేశంలో 'విఎఫ్ఎక్స్' రంగాన్ని ప్రోత్సహించాలని కేంద్ర సమాచార-ప్రసార మంత్రిత్వ శాఖ కృతనిశ్చయంతో ఉంది. ఈ మేరకు 'వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్-2025' (వేవ్స్) నేపథ్యంలో దేశంలోని ప్రసిద్ధ 'ఎవిజిసి' (యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్) సంస్థ 'ఎబిఎఐ'తో సంయుక్తంగా క్రియేట్ ఇన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా "డబ్ల్యుఎఎఫ్ఎక్స్ వేవ్స్ విఎఫ్ఎక్స్ ఛాలెంజ్ పేరిట పోటీ నిర్వహిస్తోంది. సృజనాత్మక వికాసంపై ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దృక్కోణానికి అనుగుణంగా దేశీయ ప్రతిభకు సానబెట్టడంతోపాటు సారాంశ (కంటెంట్) సృష్టికి సకల సౌకర్యాల నిలయం (ఒన్-స్టాప్ డెస్టినేషన్)గా భారత్‌ను అగ్రస్థానంలో నిలపడం దీని లక్ష్యం.

ఉద్యమ భాగస్వాములు కండి: ఈ రోజే పేరు నమోదు చేసుకోండి!

దేశవ్యాప్తంగాగల వర్ధమాన విజువల్ ఎఫెక్ట్స్ (విఎఫ్ఎక్స్) కళాకారులు 'డబ్ల్యుఎఎఫ్ఎక్స్ వేవ్స్ విఎఫ్ఎక్స్ ఛాలెంజ్'లో భాగస్వాములు కావచ్చు. తద్వారా నేడు వేగంగా దూసుకెళ్తున్న 'విఎఫ్ఎక్స్' పరిశ్రమలో గుర్తింపు పొందగలుగుతారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలైన నేపథ్యంలో వెంటనే మీ పేరు నమోదు చేసుకోండి. మరిన్ని వివరాల కోసం లిలిలి.లిజీటలీ.జీఎజీతి.జీలణఞ.తిని ను చూడండి. ఈ పోటీ మీ ప్రతిభానైపుణ్యాల ప్రదర్శనకు ఓ అవకాశంగా మాత్రమేగాక వృత్తిపరంగా ఎదగడంలో ఒక మెట్టుగానూ ఉపయోగపడుతుంది. దేశంలోని అగ్రశ్రేణి 'విఎఫ్ఎక్స్' స్టూడియోలు-మార్గదర్శకులతో కూడిన బలమైన వ్యవస్థలో చేరే అవకాశం కూడా లభిస్తుంది.

పోటీ స్వరూపం... బహుమతులు: మూడు దశలుగా 'డబ్ల్యుఎఎఫ్ఎక్స్'

ఈ పోటీల తొలిదశ కింద ఆన్‌లైన్ అర్హత (క్వాలిఫయర్) దశలో పాల్గొనాల్సి ఉంటుంది. ఈ దశలో 2000 మందికిపైగా పోటీదారులు ఉంటారని అంచనా. వీరినుంచి 'ప్రీ-సెలెక్షన్ జ్యూరీ' రెండో దశకు 10 మంది విద్యార్థులను, మరో 10 మంది వృత్తి నిపుణులను ఎంపిక చేస్తుంది. వీరు జోనల్ స్థాయి వ్యక్తిగత పోటీలలో పాల్గొంటారు. ఈ దశలో విజేతలకు తుది సంగ్రామం (గ్రాండ్ ఫినాలే)లో పాల్గొనే అవకాశం లభిస్తుంది. ఇది జాతీయ అవార్డు విజేతలైన ప్రసిద్ధ 'విఎఫ్ఎక్స్' సూపర్‌వైజర్లతో కూడిన 'గ్రాండ్ జ్యూరీ' సమక్షంలో 24 గంటల 'విఎఫ్ఎక్స్' మారథాన్ రూపంలో సాగుతుంది. 'ఆన్‌లైన్ అర్హత దశ'లో భాగంగా 'డబ్ల్యుఎఎఫ్ఎక్స్' పోటీదారులు "డైలీ లైఫ్ సూపర్ హీరో" ఇతివృత్తానికి జీవం పోస్తూ 30 సెకన్ల నిడివితో ఒక 'విజువల్ ఎఫెక్ట్స్ (విఎఫ్ఎక్స్) క్లిప్'ను రూపొందించి అప్‌లోడ్ చేయాలి. ఇందులో విజేతగా నిలిస్తే ఆకర్షణీయ బహుమతులతోపాటు రూ.5 లక్షల విలువైన వస్తువులు సహా ప్రత్యేక స్టూడియో ఇంటర్న్‌షిప్ అవకాశాలు కూడా లభిస్తాయి. ఇందులో అగ్రస్థానం సాధించినవారు చండీగఢ్, ముంబై, బెంగళూరు, కోల్‌కతా నగరాల్లో నిర్వహించే జోనల్ స్థాయి ఫైనల్స్ దశకు చేరుకుంటారు. అనంతరం వీరు పరిశ్రమలోని ప్రసిద్ధ నిపుణుల సమక్షంలో తమ సృజనాత్మక కళాప్రతిభను ప్రదర్శించాల్సి ఉంటుంది. ఈ దశలో అగ్రస్థానం సాధించిన పోటీదారులు 2025 ఫిబ్రవరి 5 నుంచి 9 వరకు ఢిల్లీలో సాగే 'వేవ్స్ సమ్మిట్'లో భాగంగా నిర్వహించే 'తుది సంగ్రామం'లో తలపడతారు.

'డబ్ల్యుఎఎఫ్ఎక్స్ ఛాలెంజ్'తో వర్ధమాన విఎఫ్ఎక్స్ కళాకారులకు సాధికారత... ప్రపంచంలో భారత్ స్థానం మరింత బలోపేతం

భారత చలనచిత్ర-మీడియా పరిశ్రమ 'విజువల్ ఎఫెక్ట్స్' పరంగా అద్భుత ప్రగతి సాధించింది. ఈ నేపథ్యంలో పరిశ్రమ అవసరాలు తీర్చగల 'విఎఫ్ఎక్స్' నిపుణులతో సరికొత్త తరాన్ని సృష్టించాలన్నది ప్రస్తుత జాతీయ పోటీల లక్ష్యం. అంతేగాక ఈ రంగంలో ప్రపంచవ్యాప్తంగా భారత్ పోటీతత్వాన్ని, సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయాలన్నది ధ్యేయం. ఆ మేరకు కర్ణాటకలోని 'ఎవిజిసి-ఎక్స్ఆర్' పరిశ్రమ సంబంధిత వాణిజ్య సంఘం 'ఎబిఎఐ' జాతీయ స్థాయిలో 'డబ్ల్యుఎఎఫ్ఎక్స్ ఛాలెంజ్' నిర్వహణకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా అత్యద్భుత 'విఎఫ్ఎక్స్' కళాఖండాలు సృష్టించాల్సిందిగా వర్ధమాన విజువల్ ఎఫెక్ట్స్ కళాకారులందరికీ పిలుపునిచ్చింది.

'డబ్ల్యుఎఎఫ్ఎక్స్ వేవ్స్ విఎఫ్ఎక్స్' ఛాలెంజ్: ఉజ్వల భవిత దిశగా యువ ప్రతిభకు ఉత్తేజం

సృజనాత్మకత, ఉత్కంఠ భరిత కథాగమన రీతికి పెట్టింది పేరుగా భారతీయ చలనచిత్ర పరిశ్రమ అంతర్జాతీయ గుర్తింపు పొందింది. దీంతోపాటు 'విఎఫ్ఎక్స్' సామర్థ్యంలోనూ పురోగతిని సాధించినందువల్ల ప్రపంచ సినిమా రంగంలో అంతర్జాతీయ ప్రమాణాలతో పోటీపడుతోంది. ఈ రంగం ఎంతో పురోగమించినా డిమాండుకు తగిన సంఖ్యలో నిపుణులు లేకపోవడం సమస్యగా మారింది. ఈ నేపథ్యంలో పరిశ్రమ సుస్థిర వృద్ధికి 'విఎఫ్ఎక్స్'లో నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కీలకంగా మారాయి. అందుకు అనుగుణంగా 'ఎవిజిసి' రంగంలో ఆకర్షణీయ అవకాశాల కల్పన దిశగా ప్రతిభాన్వేషణ ద్వారా యువతరం సామర్థ్యానికి పదునుపెట్టి, ప్రోత్సహించడం లక్ష్యంగా 'డబ్ల్యుఎఎఫ్ఎక్స్ వేవ్స్ విఎఫ్ఎక్స్ ఛాలెంజ్' పేరిట 'ఎబిఎఐ' ఈ ప్రతిష్ఠాత్మక పోటీలను నిర్వహిస్తోంది.

కొత్త నైపుణ్యాలతో భారత సృజనాత్మక పరిశ్రమ ముందంజకు 'డబ్ల్యుఎఎఫ్ఎక్స్ ఛాలెంజ్', 'వేవ్స్' తోడ్పాటు

ఈ రంగంలో ప్రగతిశీల మార్పుదిశగా వైతాళిక పాత్ర పోషించే 'డబ్ల్యుఎఎఫ్ఎక్స్, 'వేవ్స్' ప్రాధాన్యం గురించి 'ఎబిఎఐ' ప్రెసిడెంట్, టెక్నికలర్ గ్రూప్ ఆసియా పసిఫిక్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ బీరెన్ ఘోస్ తన ప్రసంగంలో వివరించారు. "ఈ సృజనాత్మక రంగంలో విశేష ప్రగతిశీల మార్పులు వస్తున్నాయి. అత్యాధునిక సాంకేతికత, ఆకట్టుకునే సారాంశం తదితరాలు వీక్షకుల అనుభవాన్ని సుసంపన్నం చేస్తున్నాయి" అని అన్నారు. అలాగే "మనం ఈ కొత్త ఆర్థిక వ్యవస్థలో పాదం మోపిన నేపథ్యంలో కథాగమనం, భావనాత్మకత ప్రదర్శనకు టీవీలు, థియేటర్లకు మించి మ్యూజియంలు, విమానాశ్రయాలు, బహిరంగ ప్రదేశాలు కూడా వేదికలుగా మారుతున్నాయి. ఈ పరిణామం ఆవిష్కరణలను ప్రోత్సహించడంతోపాటు దేశీయంగానే కాకుండా భారత్ వెలుపల కూడా సారాంశ సృష్టిలో కొత్త నైపుణ్యాలు, విభిన్న ఉపాధి అవకాశాలకు బాటలు వేస్తుంది. అందుకే 'ఎవిజిసి-ఎక్స్ఆర్' సంబంధిత ప్రతి అంశాన్నీ ప్రస్తుతం చేస్తూ, ముఖ్యంగా... దేశం నలుమూలల నుంచి వేలాది భారతీయుల దృష్టిని ఆకర్షించేలా 'డబ్ల్యుఎఎఫ్ఎక్స్ ఛాలెంజ్'కి రూపమిచ్చాం. ప్రపంచ వేదికపై 'వేవ్స్' వేదికగా 'తుది సంగ్రామం' ద్వారా యువతరం ప్రతిభానైపుణ్య ప్రదర్శనకు ఇది తోడ్పడుతుంది" అని చెప్పారు.

వివిధ రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలు.. 'సిఎపిఎఫ్'లు.. 'సిపిఒ'ల పరిధిలోని 463 మంది సిబ్బందికి 2024కుగాను 'కేంద్రీయ గృహమంత్రి దక్షత పదక్' ప్రదానం

న్యూఢిల్లీ, నవంబర్ 1:దేశంలోని వివిధ రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలతోపాటు 'సిఎపిఎఫ్'లు, 'సిపిఒ'లలో విధులు నిర్వర్తిస్తున్న 463 మంది అధికారులు, సిబ్బందికి 2024కుగాను 'కేంద్రీయ గృహమంత్రి దక్షత పదక్' పురస్కారాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రదానం చేసింది.

అసాధారణ పనితీరుకు గుర్తింపు నహా వృత్తిపరంగా ఉన్నత ప్రమాణాలను ప్రోత్సహిస్తూ ప్రకటించే ఈ పురస్కారం కింద పేర్కొన్న విభాగాల్లో పనిచేసే అధికారులు/సిబ్బందిలో నైతిక స్థైర్యం పెంచుతుంది.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర హోం-సహకార శాఖల మంత్రి శ్రీ అమిత్ షా మార్గదర్శకత్వాన ప్రవేశపెట్టిన 'కేంద్రీయ గృహమంత్రి దక్షత పదక్' పోలీసు సిబ్బందిలో ఆత్మవిశ్వాసం ఇనుమడింపజేస్తుంది.

కేంద్ర హోం వ్యవహారాల శాఖ ఒక నోటిఫికేషన్ ద్వారా 2024 ఫిబ్రవరి నుంచి ఈ పురస్కారాన్ని ప్రవేశపెట్టింది. అప్పటినుంచి పోలీసు బలగాలు, భద్రత సంస్థ, నిఘా విభాగం సహా రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లోని స్పెషల్ బ్రాంచీలు, 'సిపిఒ'లు, 'సిఎపిఎఫ్'లు, నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్, అస్సాం రైఫిల్స్, (కేంద్ర, రాష్ట్ర, కేంద్రపాలిత ప్రాంత) ఫోరెన్సిక్ సైన్స్ కార్యాలయాల్లో పనిచేసే అధికారులు, సిబ్బందిని ఈ పురస్కారానికి ఎంపిక చేస్తున్నారు. దైనందిన, ప్రత్యేక కార్యకలాపాల్లో అసాధారణ పనితీరు, పరిశోధనలో అత్యుత్తమ నైపుణ్యం, దృఢదీక్షతో కూడిన సాహసోపేత నిఘా సేవలు, ఫోరెన్సిక్ సైన్స్ రంగంలో ప్రభుత్వ శాస్త్రవేత్తల ప్రశంసనీయ సేవల ప్రాతిపదికగా ఈ ఎంపిక చేపడతారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఏటా అక్టోబరు 31న పురస్కార విజేతలను ప్రభుత్వం ప్రకటిస్తోంది.

శంషాబాద్ ఎయిర్ పోర్టులో రూ.7కోట్ల విలువైన డ్రగ్స్ పట్టివేత

హైదరాబాద్, నవంబర్ 1:శంషాబాద్ ఎయిర్ పోర్టులో భారీగా డ్రగ్స్ పట్టుబడింది. బ్యాంకాక్ నుంచి హైదరాబాద్ వచ్చిన ఇద్దరిని అరెస్ట్ చేశారు. అరెస్ట్ చేసిన ఇద్దరి నుంచి రూ.7కోట్ల విలువైన డ్రగ్స్ ను డీఆర్ఐ అధికారులు సీజ్ చేశారు.

వివరాల్లోకి వెళ్తే.. బ్యాంకాక్ నుంచి వస్తున్న ప్రయాణికులు డ్రగ్స్ సరఫరా చేస్తున్నారని ఇంటెలిజెన్స్ సిబ్బంది ఎయిర్‌పోర్ట్ డీఆర్ఐ అధికారులకు సమాచారమిచ్చారు. అప్రమత్తమైన అధికారులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఈ మేరకు బ్యాంకాక్ నుంచి వచ్చిన ఇద్దరు ప్రయాణికులను అదుపులోకి తీసుకుని సోదాలు చేపట్టారు. సోదాల్లో వారి వద్ద సుమారు 7 కోట్ల రూపాయల విలువైన డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కురుమూర్తి స్వామి జాతరకు ప్రత్యేక బస్సులు !

హైదరాబాద్, నవంబర్ 1:తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రసిద్ధ క్షేత్రమైన శ్రీ కురుమూర్తి స్వామి జాతరకు వెళ్లే భక్తులకు టీజీఎస్ఆర్టీసీ శుభవార్త చెప్పింది. జాతరకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం హైదరాబాద్ నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపనుంది. ఈ మేరకు సంస్థ ఎండీ సజ్జనార్ తెలిపారు.

కురుమూర్తి జాతరలో ప్రధాన ఘట్టమైన ఉద్గాల ఉత్సవం నవంబర్ 8వ తేదిన జరగనుంది. దీంతో 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉందని.. ఈ నేపథ్యంలో ఆయా రోజుల్లో ప్రత్యేక బస్సులను హైదరాబాద్ నుంచి సంస్థ అందుబాటులో ఉంచుతోందని సజ్జనార్ వెల్లడించారు.

ప్రణాళిక బద్ధంగా ఇంటింటి సర్వే చేపట్టాలి: జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి.

-సంగారెడ్డి లోనిశివాజీ నగర్, ఇరిగిపల్లి లో ఇంటింటి సర్వే పరిశీలించిన కలెక్టర్.

సంగారెడ్డి, నవంబర్ 1: (నేటినిజం ప్రతినిధి):ప్రణాళిక బద్ధంగా ఇంటింటి సర్వే కార్యక్రమం నిర్వహించాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సంగారెడ్డి పట్టణంలోని శివాజీ నగర్, సంగారెడ్డి మండల పరిధిలోని ఇరిగిపల్లి గ్రామాలలో నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కొన్ని ఇండ్లను సందర్శించి వారి కుటుంబ వివరాలను అడిగి తెలుసుకున్నారు . సమగ్ర సర్వే లో ప్రజల సహకారం ఎంతో అవసరమన్నారు . ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ సర్వే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ సూచించారు.

కుటుంబ సర్వేలో సామాజిక, ఆర్థిక, విద్య ,ఉద్యోగ, రాజకీయ అంశాలను సమీక్షించడం జరుగుతుందన్నారు. ఈ సర్వే కోసం ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లు బ్లాక్ ల వారీగా ఇండ్ల వివరాలను సిద్ధం చేసుకోవాలన్నారు. సంగారెడ్డి మున్సిపల్ పరిధిలో అన్ని ఏర్పాట్లు పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోనని మున్సిపల్ కమిషనర్ను కలెక్టర్ ఆదేశించారు. సర్వే కోసం అవసరమైన ఇంటి జాబితా, ఫారాలు, స్టిక్కర్లు కలెక్టరేట్ ద్వారా తీసుకోవాలన్నారు. ఇంటి జాబితా ప్రక్రియను ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లు ప్రారంభించేలా చూడాలని తహసిల్దారులు మున్సిపల్ కమిషనర్లు కలెక్టర్ ఆదేశించారు. ప్రతి ఇంటికి ఎన్యుమరేటర్లు వెళ్లి నిర్ణీత ప్రొఫార్మా లో సర్వే వివరాలను నమోదు చేయాలన్నారు. సర్వే పూర్తయిన ఇంటికి స్టిక్కర్లను అతికించాలన్నారు. ఇంటి జాబితా ఫారం లో అన్ని ప్రశ్నలకు నమోదు చేయాలని సూచించారు. ఇంటింటి సర్వే ఏర్పాట్లు పరిశీలించిన అనంతరం కలెక్టర్ ఇరిగిపల్లి ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు పాఠశాలల్లో విద్యార్థుల నమోదు తక్కువగా ఉండటం చూసి ఉపాధ్యాయులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు నమోదు పెంచడానికి ఉపాధ్యాయులు సిబ్బంది మరింత కృషి చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ విజయలక్ష్మి, మండల ప్రత్యేకధికారి ఖాసీం బేగ్,తాహసిల్దార్ దేవదాస్, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్ సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

అదుపు తప్పిన బైక్.. ఇద్దరి మృతి..

కర్నూలు, నవంబర్ 1:వెల్దుర్తి సమీపంలోని అల్లుగుండు నేషనల్ హైవేలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. కర్నూలు జిల్లాలోని సి బెళగల్ మండల పరిధిలోని కొండాపూర్ కు చెందిన వ్యక్తులు కర్నూల్ నుంచి వెల్దుర్తికి బైక్పై వస్తున్న సమయంలో ప్రమాదానికి గురయ్యారు. మృతులు సి.బెళగల్ మండలం కొండాపురం గ్రామానికి చెందిన అడ్డాకుల చిన్న ,అనిల్ కుమార్ గా గుర్తించారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బెలగల్ మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన అనిల్ కుమార్, చిన్న మునిస్వామి ఇద్దరు కలసి కర్నూలు నుంచి వెల్దుర్తికి ద్విచక్రవాహనంపై వస్తున్నారు. అల్లుగుండు సమీపంలో వీరి వాహనం రహదారి పక్కన ఉన్న ఇనుప దిమ్మెను ఢీకొట్టి పక్కనే ఉన్న ముళ్ల కంపలో పడిపోయారు. ఈ ఘటనలో ఇద్దరు అక్కడిక్కడే మృతి చెందారు. శుక్రవారం ఉదయం తెల్లవారుజామున హైవే పోలీసులు గుర్తించి మృతదేహాలను వెల్దుర్తి ఆస్పత్రికి తరలించారు. అనిల్ కుమార్ సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్, చిన్న మునిస్వామి ఓ ప్రైవేటు పాఠశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు.

ఎస్పీడీఏ ఆధ్వర్యంలో డ్రైవర్లకు ఐడికార్డులను పంపిణీచేసిన దయాకర్ రెడ్డి

ఖమ్మం, నవంబర్ 1: (నేటినిజం ప్రతినిధి):ఖమ్మం నగరంలోని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సేఫ్టీ ప్రొటెక్షన్ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఐడి కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాని కి ముఖ్యఅతిథిగా మంత్రి క్యాంపు కార్యాలయం ఇంచార్జ్ తుంబూరి దయాకర్ రెడ్డి చేతుల మీదుగా డ్రైవర్లకు ఐడి కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డ్రైవర్లను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ...డ్రైవర్లకు గుర్తింపు కార్డుతో పాటుగా లైసెన్స్, జీవిత భీమా ఎంతో అవసరమని చెప్పారు. డ్రైవర్లకు వైద్యం నిమిత్తం ఖమ్మంలోని కిమ్స్ హాస్పిటల్ లో తగ్గింపుతో డ్రైవర్లకు వైద్య సేవలు అందించేందుకు హెల్త్ కార్డులు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. కారు డ్రైవర్లకు అడ్డా ఏర్పాటుకు కృషిచేయాలని అసోసియేషన్ తరపున కోరారు. వాహనాల ట్యాక్స్ మినహాయింపు మంత్రి పొంగులేటి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషిచేస్తానని దయాకర్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీడీఏ ఫౌండర్స్ పి.నాగేశ్వరరావు, కె.బాబు, పి.కిషన్ రావు, జి.శరత్, షేక్.నాగుల్ మీరా, కె.ఉపేంద్ర, ఎం.డి.నవీద్ ఖాన్, షేక్.యూసుబ్ మియా, పి.అశోక్ కుమార్, ఎన్.విజయ్, జె.కార్తీక్, తదితరులున్నారు.

పండుగపూట విషాదం.. గోదావరిలో ఇద్దరు విద్యార్థులు మృతి

ఆదిలాబాద్, నవంబర్ 1:గోదావరిలో ఇద్దరు విద్యార్థులు గల్లంతయ్యారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలం సుందరసాల గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే దుగ్నేపెల్లి గ్రామానికి చెందిన దాసరి కృష్ణ, మధులతల కుమారుడు దాసరి సాయి(16) ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం కరీంనగర్?లో చదువుతున్నాడు.అతనితో పాటు మరో విద్యార్థి గ్రామానికి చెందిన కొండ పోచయ్య, శోభల కుమారుడు కొండ అరుణ్(19) కిష్టంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. దీపావళి పండుగను పురస్కరించుకొని తోటి మిత్రులతో కలిసి గ్రామంలోని గోదావరిలో స్నానానికి వెళ్లారు. నీటిలో మునిగి గల్లంతయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గజ ఈ

ఈనెల 3న 20వేల మందితో ప్రభుత్వ ఉద్యోగుల ఆత్మీయసమ్మేళన వనసమారాధన

- కుల,మత,రాజకీయాలకు అతీతంగా ఆత్మీయ సమ్మేళనం

పాత్రికేయుల సమావేశంలో టీజీఇ జేఏసీ రాష్ట్ర సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు వెల్లడి

ఖమ్మం, నవంబర్ 1: (నేటినిజం ప్రతినిధి):ప్రభుత్వ సంక్షేమ ఫలాలను ప్రజల వద్దకు చేర్చేందుకు నిత్యం పని ఒత్తిడితో ఉండే ఉద్యోగులలో మానసిక ఒత్తిడిని తగ్గించి, ఉత్సాహాన్ని, ఐక్యతను పెంచేందుకు ఈనెల 3న(ఆదివారం)తెలంగాణ ఉద్యోగుల,గెజిటెడ్ ఆఫీసర్స్,ఉపాధ్యాయులు,కార్మికులు,పెన్షనర్స్ మొత్తం 20వేల మంది ఉద్యోగ కుటుంబ సభ్యులతో ఆత్మీయ సమ్మేళనంతో పాటు వనసమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు టీజీఇ జేఏసీ రాష్ట్ర సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం గొల్లగూడెం రోడ్డులోని చెరుకూరి మామిడి తోటలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో కార్యక్రమ వివరాలు వెల్లడించారు. శుక్రవారం ఖమ్మం నగరంలోని చెరుకూరి వారి మామిడి తోటలో ఉపాధ్యాయ సంఘం ఎస్టీఎఫ్ రాష్ట్ర నాయకులు దేవరకొండ సైదులు, నాగిరెడ్డి, టీజీఓ జిల్లా అధ్యక్షులు కస్తాల సత్యనారాయణ, కార్యదర్శి వేలాద్రి, టీఎన్జిఓస్ నాయకులు గుంటుపల్లి శ్రీనివాస్, కొణిదెన శ్రీనివాస్, జడ్ఎస్ జయపాల్, ఇతర జేఏసి, భాగస్వామ్య ఉద్యోగుల సంఘ నాయకులతో కలిసి ఏలూరి మాట్లాడారు. ఈ కార్యక్రమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు సైతం హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. 206 సంఘాలతో జేఏసీ ఏవిధంగా ఏర్పడిందో, అదేవిధంగా పూర్వ వైభవం తేవడానికి ఈ ప్రయత్నం అన్నారు. ఉద్యోగులలో మానసిక ఉల్లాసాన్ని పెంచేందుకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా ఉద్యోగుల ఐక్యతను చాటిచెప్పే లక్ష్యంతో కుల, మతాలకు, రాజకీయాలకు అతీతంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేస్తామన్నారు. దీనికి జిల్లాకు చెందిన రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లతోపాటుగా జిల్లాకు ఎంపీలు, ఎమ్మెల్యేలు, రాష్ట్ర కార్పొరేషన్ ఛైర్మన్లు, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ ను ప్రత్యేక ఆహ్వానితులుగా ఆహ్వానించామని వివరించారు. అలాగే ఎంపిక చేసిన కొందరికి సన్మాన కార్యక్రమం ఉంటుందని అన్నారు. కుల,మత,రాజకీయ పార్టీలకు అతీతంగా జరిగే ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనంకు ఉద్యోగుల కుటుంబ సంభ్యులు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. వన సమరాధనకు ఉద్యోగుల కుటుంబాలకు వచ్చే వీలుగా ఖమ్మం నగరంలోని ఆరు సెంటర్ల నుంచి ప్రత్యేకంగా బస్ సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటుతో ఉద్యోగులకు నమ్మకం పెరిగిందన్నారు. అపరిష్కృతంగా ఉన్న ఐదు డీఏలలో ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ఒక్క డీఏను మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఏర్పాటు తర్వాత ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీష్ ఉద్యోగుల 53డి మాండ్లను ప్రభుత్వం ముందుంచి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నవంబర్ 17, 18 తేదీల్లో గ్రూప్ -3 పరీక్షలు

హైదరాబాద్, నవంబర్ 1:గ్రూప్ -3 పరీక్షలు నవంబర్ 17, 18 తేదీల్లో జరగనున్నాయి. ఈ పరీక్ష నిర్వహించనున్నట్లు ఇప్పటికే ప్రకటించిన తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ బుధవారం పూర్తి షెడ్యూల్‌ను విడుదల చేసింది. రెండు సెషన్లలో ఈ పరీక్ష నిర్వహించనుండగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్ 1, మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5.30గంటల వరకు పేపర్ -2 నిర్వహించనున్నారు. అలాగే నవంబర్ 18న పేపర్ 3 పరీక్షను ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు నిర్వహిస్తారు.

నవంబర్ 10న హాల్ టికెట్లు అందుబాటులోకి రానున్నాయి. గ్రూప్ 3 పరీక్ష మొదటి సెషన్‌కు ఉదయం 8.30గంటల నుంచి,రెండో సెషన్‌కు మధ్యాహ్నం 1.30గంటల లోపే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారు. ఉదయం సెషన్‌లో 9.30గంటలకు, మధ్యాహ్నం సెషన్‌లో 2.30గంటలకు గేట్లు మూసివేస్తామని, ఆ తర్వాత ఎట్టిపరిస్థితుల్లో అనుమతించబోమని తేల్చి చెప్పారు. సెలక్షన్ ప్రక్రియ పూర్తయ్యే వరకు అభ్యర్థులు తమ హాల్‌టికెట్లను, క్వశ్చన్‌పేపర్లు జాగ్రత్త చేసుకోవాలని టీజీపీఎస్సీ సూచించింది. డూప్లికేట్ హాల్ టికెట్లను తర్వాత జారీ చేయబోమని స్పష్టం చేసింది. తెలంగాణలో 1388 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయగా గ్రూప్ -3 పోస్టులకు 5.36 లక్షల మందికి పైగా దరఖాస్తు చేసుకున్న విషయం తెలిసిందే. నవంబర్ 10 నుంచి https://www.gov.in లో అభ్యర్థులు హాల్ టికెట్లు డౌన్ లోడ్ చేసుకోవచ్చు.

ఎమ్మెల్యేకు దీపావళి శుభాకాంక్షలు తెలిపిన మేకల మల్లిబాబు యాదవ్

ఖమ్మం, నవంబర్ 1: (నేటినిజం ప్రతినిధి):దీపావళి పర్వదిననీ రోజు ఇల్లందు ఎమ్మెల్యే కోరనీ కనకయ్యను ఇల్లందు క్యాంపు కార్యాలయంలో డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. తదనంతరం పాత్రికేయుల ఇష్టాగోష్టి లో మల్లిబాబు యాదవ్ మాట్లాడుతూ...ప్రతి పేదవాడు రేషన్ కార్డు ఇండ్లు లేకుండా ఉండకూడదు అనే సంకల్పంతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం దీపావళి పండుగ తర్వాత ఇంటింటి సర్వే జరిపించి అర్హులైన ప్రతి లబ్దిదారులకు ఇండ్ల కార్యక్రమం చేపట్టబోతుందని ఎమ్మెల్యేను ప్రత్యేకంగా కలవడం జరిగిందని కాంగ్రెస్ పార్టీ చేపట్టే కార్యక్రమం నిజమైన దీపావళిగా గుర్తించబడు తుందని హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలను చూచి సహించలేని ప్రతిపక్షాలు గగ్గోలు పెడుతున్నాయని కుటుంబ పాలనతో ఏకపక్ష నిర్ణయాలు తీసుకుని ఏ రాజకీయ నాయకులు మాటలను కూడా లెక్కచేయకుండా కనీసం ఒక మంత్రి అనే వ్యక్తికి గాని తెలంగాణ పోరాటంలో తన వెంట తిరిగిన సహచరులకు గాని కనీసం మాట్లాడే అవకాశం కూడా ఇవ్వకుండా చేసినవారు ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకించడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. కామేపల్లి మండలంలోనే కాకుండా ఇల్లందు నియోజకవర్గ అభివృద్ధి కేవలం కోరం కనకయ్యతోనే సాధ్యపడిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుగులోతు రవి, భూక్యా నాగేంద్రబాబు, శీలం పుల్లయ్య, పాటిబండ్ల ప్రసాదు, మేకల మహేష్ బాబు, తదితరులున్నారు.

ఆదిలీల ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు ఉచితంగా బియ్యం పంపిణి

-ప్రభుత్వాలు కూడా స్వచ్ఛంద సేవ సంస్థలను ప్రోత్సహించాలి

- డాక్టర్ ఆదినారాయణ ఆది లీలా ఫౌండేషన్ అధ్యక్షుడు

హైదరాబాద్నవంబర్ 1: (ఎక్స్ ప్రెస్ న్యూస్);దీపావళి పండుగ సందర్భంగా ఆది లీల ఫౌండేషన్ మరియు మోహన్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రంలో అన్నదానమే ఆధారంగా నిరంతరం సేవలు అందిస్తూ పేదలకు ఉచితంగా బియ్యాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా ఆది లీలా ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఆదినారాయణ మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యం లో సేవ కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల్లో సేవాభావం పెరిగేటట్టుగా కృషి చేస్తున్నట్టు తెలుపుతూ ప్రభుత్వాలు కూడా స్వచ్ఛంద సేవ సంస్థలను ప్రోత్సహిస్తూ వారి సేవలను వినియోగించే విధంగా కృషి చేయాలని తెలిపారు త్వరలోనే దేశ వ్యాప్త సదస్సు ఢిల్లీలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు కార్యక్రమంలో సభాధ్యక్షులు మోహన్ ట్రస్ట్ అధ్యక్షులు ప్రముఖ వ్యాఖ్యాత మోహన్ గాంధీ మైనింగ్ ఆఫీసర్ వేణుగోపాల్, మాతృదేవోభవ సత్సంగ్ అధ్యక్షులు కేబీ శ్రీధర్, సాయి సేవా సమాజ్ అధ్యక్షులు సుధాకర్ గుప్తా, వివిధ రంగాల్లో సేవ చేసిన ప్రముఖులు మాతృదేవోభవ సత్సంగ్ ఆది లీల ఫౌండేషన్ కార్యవర్గ సభ్యులు శ్రీవాణి, గజ్జల రమేష్ ,సుదర్శన రెడ్డి చంద్రశేఖర్ శ్రీనివాసు (వరంగల్), నున్న శ్రీనివాస్, నాగేంద్ర రాజు, నందికొండలరావ్, సంస్కృత పండితులు ప్రభాకర్ పాల్గొన్నారు

కిషోర్ బాబు ప్రథమవర్ధంతి కార్యక్రమానికి హాజరైన డా.కోట రాంబాబు

ఖమ్మం, నవంబర్ 1: (నేటినిజం ప్రతినిధి):మధిర మున్సిపాలిటీ పరిధిలో ఇల్లెందులపాడు గ్రామంలో టీడిపి నాయకులు చేకూరి శేఖర్ బాబు తండ్రి మాజీ సర్పంచ్ కీ.శే చేకూరి కిషోర్ బాబు ప్రథమవర్ధంతి కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు డా.కోట రాంబాబు హాజరై వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

రక్షణ శాఖ కార్యదర్శిగా శ్రీ రాజేశ్ కుమార్ సింగ్ పదవీ బాధ్యతల స్వీకారం

న్యూఢిల్లీ, నవంబర్ 1:రక్షణ కార్యదర్శిగా నియమితులైన శ్రీ రాజేశ్ కుమార్ సింగ్ న్యూ ఢిల్లీ లోని సౌత్ బ్లాక్‌లో ఈ రోజు పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఆయన కేరళ కేడరుకు చెందిన 1989 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. ఈ ఏడాది ఆగస్టు 20న ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (రక్షణ కార్యదర్శి పదవిలో నియమితుడు)గా ఆయన బాధ్యతలు చేపట్టారు.

శ్రీ రాజేశ్ కుమార్ సింగ్ న్యూ ఢిల్లీలోని జాతీయ యుద్ధ స్మారకానికి వెళ్లి, అమరులైన జవానులకు నివాళులు సమర్పించి ఆ తరువాత నూతన పదవీబాధ్యతలను స్వీకరించారు. "మాతృభూమికి సేవ చేయడంలో అత్యున్నత త్యాగానికి వెనుదీయని మన శూర జవానులకు ఈ దేశ ప్రజలు ఎప్పటికీ రుణపడి ఉంటారు.

అమర సైనికుల అసాధారణ ధైర్య సాహసాలు, వారి త్యాగాలు భారత్ ను ఒక సురక్షిత, సమృద్ధ దేశంగా తీర్చిదిద్దడానికి మనకందరికీ శక్తిని, ప్రేరణను అందిస్తూనే ఉంటాయి" అని శ్రీ రాజేశ్ కుమార్ సింగ్ అన్నారు.

అంతకు ముందు, శ్రీ రాజేశ్ కుమార్ సింగ్ 2023 ఏప్రిల్ 24 నుంచి 2024 ఆగస్టు 20 మధ్య కాలంలో వాణిజ్య, పరిశ్రమ శాఖలోని అంతర్గత వాణిజ్యం-పరిశ్రమల ప్రోత్సాహక విభాగం కార్యదర్శిగా సేవలు అందించారు. అంతకంటే ముందు, ఆయన మత్స్య, పశు సంవర్ధక, పాడి పరిశ్రమ శాఖలో పశు సంవర్ధకం - పాడి పరిశ్రమ కార్యదర్శి బాధ్యతలను నిర్వర్తించారు.

శ్రీ రాజేశ్ కుమార్ సింగ్ కు కేంద్ర ప్రభుత్వంలో అనేక ఇతర పదవులను నిర్వహించిన అనుభవం ఉంది. ఆయన పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖలో వర్క్స్ అండ్ అర్బన్ ట్రాన్స్‌పోర్ట్ లో డైరెక్టర్; డీడీఏ లో కమిషనర్ (భూములు); పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖలో సంయుక్త కార్యదర్శి; వ్యవసాయం, సహకారం - రైతుల సంక్షేమ విభాగంలో సంయుక్త కార్యదర్శి గాక, భారత ఆహార సంస్థలో ముఖ్య నిఘా అధికారిగా పని చేశారు.

ఆయన రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలో పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి గా, కేరళ ప్రభుత్వంలో ఆర్థిక కార్యదర్శి గా ముఖ్య పదవులను కూడా నిర్వహించారు.

రక్షణ కార్యదర్శి పదవీ బాధ్యతలను నిర్వహించి, నిన్న పదవీ విరమణ చేసిన ఆంధ్ర ప్రదేశ్ కేడరుకు చెందిన 1988 బ్యాచ్ ఐఏఎస్ అధికారి శ్రీ గిరిధర్ అరమానే స్థానంలో ఆ పదవిని శ్రీ ఆర్ కే సింగ్ చేపట్టారు.

మహా నేత సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ ను స్మరించుకోవడానికే 'ఐక్యతా పరుగు'

న్యూఢిల్లీ, నవంబర్ 1:'ఐక్యతా పరుగు' కు కేంద్ర హోం - సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా న్యూ ఢిల్లీలో ఈ రోజు పచ్చజెండాను చూపించి, ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఏటా అక్టోబరు 31న 'జాతీయ ఐక్యత దినోత్సవం'లో భాగంగా నిర్వహిస్తూ వస్తున్న సంగతి తెలిసిందే. కేంద్ర మంత్రులు శ్రీ మనోహర్ లాల్ ఖట్టర్, డాక్టర్ మన్‌సుఖ్ మాండవీయ, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి శ్రీ నిత్యానంద్ రాయ్, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ శ్రీ వినయ్ కుమార్ సక్సేనా, అనేక మంది ఉన్నతాధికారులు ఐక్యతా పరుగు కార్యక్రమంలో పాల్గొన్నారు.

మహా నేత సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ ను స్మరించుకొంటూ 2015లో 'ఐక్యతా పరుగు'ను నిర్వహించాలని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నిర్ణయించిన విషయాన్ని కేంద్ర హోం మంత్రి శ్రీ అమిత్ షా తన ప్రసంగంలో గుర్తుకు తెచ్చారు. భారత్ ఏకత, సమగ్రతలను పరిరక్షిస్తూ పౌరులు ప్రతిజ్ఞ చేయడం ఇందులో భాగం అని శ్రీ అమిత్ షా అన్నారు. అప్పటి నుంచి 'ఐక్యతా పరుగు' మాధ్యమం ద్వారా యావత్తు దేశప్రజలు కేవలం ఏకత, సమగ్రతల పరిరక్షణ కు ప్రతిజ్ఞ చేయడం ఒక్కటే కాకుండా భరత మాత సేవకు పునరంకితం అవుతూ వస్తున్నారని శ్రీ షా అన్నారు. 'ఐక్యతా పరుగు' దేశ ఐకమత్య ప్రతిజ్ఞ ఘట్టాన్ని ఆవిష్కరించడంతో పాటు సర్వతోముఖంగా అభివృద్ధి చెందిన భారతదేశాన్ని ('వికసిత్ భారత్') నిర్మించాలన్న ప్రతిజ్ఞగా కూడా రూపొందిందని కేంద్ర మంత్రి శ్రీ అమిత్ షా అన్నారు. 2047 కల్లా అన్ని రంగాల్లో సంపూర్ణంగా అభివృద్ధి చెందిన భారతదేశాన్ని సాకారం చేయాలని దేశ ప్రజలందరి ఎదుటా ఒక ప్రతిజ్ఞను ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రతిపాదించారని కేంద్ర మంత్రి అన్నారు.

ఇవాళ ప్రపంచంలో వికసిస్తున్న, వర్ధిల్లుతున్న, బలమైన దేశంగా భారతదేశం నిలబడిందని శ్రీ అమిత్ షా అన్నారు. మనం ఒకసారి చరిత్రను పరిశీలిస్తే స్వాతంత్ర్యం వచ్చిన తరువాత 550కి పైగా సంస్థానాలను ఏకతాటి మీదకు తీసుకువచ్చి, ఆధునిక కాలపు నవీన భారతదేశంగా మలచడం కేవలం సర్దార్ పటేల్ దృఢ సంకల్పం, సత్వర నిర్ణయాల వల్లనే సాధ్యపడిందని తెలుస్తుందని శ్రీ అమిత్ షా అన్నారు. సర్దార్ పటేల్ దృఢ సంకల్ప శక్తి కారణంగా నేడు భారతదేశం ప్రపంచంలో ఐకమత్యానికి, దృఢత్వానికి ప్రతీకగా ఉందని శ్రీ అమిత్ షా అన్నారు. ఇవాళ భారతదేశం ప్రపంచంలో ప్రతి రంగంలోను నాయకత్వాన్ని వహించే మార్గంలో పయనిస్తోందంటే అందుకు సర్దార్ పటేల్ పునాది వేశారని కేంద్ర మంత్రి అన్నారు.

సర్దార్ పటేల్ ను కొన్ని సంవత్సరాల తరబడి మరచిపోవడం దురదృష్టకరం, సర్దార్ పటేల్ ను 'భారత్ రత్న'తో ఏనాడో గౌరవించుకోవలసి ఉన్నా అలా జరగలేదని శ్రీ అమిత్ షా అన్నారు. సర్దార్ పటేల్ కు గుజరాత్‌లోని కేవడియాలో ప్రపంచంలోనే అతి ఎత్తయిన విగ్రహాన్ని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఏర్పాటుచేసి ఆయన జ్ఞాపకాన్ని చిరస్థాయిగా నిలబెట్టారని శ్రీ అమిత్ షా అన్నారు. సర్దార్ పటేల్ దార్శనికతకు, ఆలోచనలకు, ఆయన ఇచ్చిన సందేశానికి అన్ని రంగాలలోను నిర్దిష్ట రూపాన్ని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఇచ్చారని శ్రీ అమిత్ షా అన్నారు.

సర్దార్ పటేల్ అంతరంగంలోని గొప్ప గొప్ప ఆలోచనలు దేశ యువతరానికి మార్గదర్శనం చేస్తుంటాయని శ్రీ అమిత్ షా అన్నారు. 'ఐక్యతా పరుగు'లో ప్రజలు పాలుపంచుకోవాలని, 2047కల్లా అన్ని రంగాల్లోను సంపూర్ణంగా అభివృద్ధి చెందిన భారతదేశాన్ని ఆవిష్కరించాలనే కలను వండించి భారత్ ఐక్యతను బలపరుస్తామంటూ ప్రతిజ్ఞ చేయాలని కేంద్ర హోం మంత్రి ప్రజలకు పిలుపునిచ్చారు.

హాస్టళ్ళలో చదివే విద్యార్థులకు మెస్ ఛార్జీలు పెంచడం పట్ల హర్షం

-ఇది విద్యార్థుల పోరాట విజయం

-బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు,మాజీ రాజ్య సభ సభ్యులు ఆర్.కృష్ణయ్య

హైద్రాబాద్ నవంబర్ 1.(ఎక్స్ ప్రెస్ న్యూస్),రాష్ట్రంలోని హాస్టళ్ళ, గురుకుల పాఠశాల విద్యార్థుల మెస్ చార్జీలను పెంచినందుకు హర్షం వ్యక్తం చేస్తున్నాం. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి - ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు.శుక్రవారం బిసి భవన్ లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ ఈ పెంపుదల గతం కంటే మంచిగా ఉంది అన్నారు. గురుకులాలు మరియు హాస్టళ్ళలో చదువుకొని 8 లక్షల 50వేల మంది విద్యార్థులకు ఈ పెంపుదల ప్రయోజనం చేకూర్చుతుందన్నారు. కాలేజీ హాస్టళ్ళకు 1500 నుండి 2100, గురుకుల పోస్టళ్ళలో 3వ తరగతి నుండి 7వ తరగతి వరకు 950 నుండి 1330, 8వ తరగతి నుండి 10వ తరగతి కి 1100 నుండి 1540 పెంచారు. అదే విధంగా కాస్మోటిక్ చార్జీలు పెంపుదల పట్ల విద్యార్థులు హర్షం వ్యక్తం చేసారు. మంచిగా మెనూ తయారు చేసి పౌష్టిక ఆహారం పెట్టాలన్నారు.రాష్ట్రంలో 295 బీసీ కాలేజీ హాస్టళ్లకు, 321 బీసీ గురుకుల పాఠశాలలకు ఒకదానికి కూడా సొంత భవనాలు లేవు. కేటాయించిన ప్రభుత్వ స్థలాలను కూడా ప్రైవేటు సంస్థలకు, వ్యక్తులకు అధికారులు లంచాలు తిని దారదత్తం చేస్తున్నారు. దొరల కార్లు వెళ్లడానికి మాదాపూర్, కొండాపూర్, గచ్చిబౌలి, కోకా పేట్ లో ఫ్లై ఓవర్లు, స్కై ఓవర్స్ ను వేలకోట్ల రూపాయలతో వెచ్చించి కడుతున్నారు. కానీ చదువుకొని భవిష్యత్తులో ఐఏఎస్, ఐపీఎస్ లు, డాక్టర్లు, ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు కావల సిన విద్యార్థులను బందెల దొడ్డిలో పశువులను తొలినట్లు ఒక్కొక్క రూంలో 20 నుంచి 50 మందిని వుంచుతున్నారు. భవిష్యత్ దెబ్బ తీస్తున్నారు. చదువు దెబ్బ తింటుంది. ఆరోగ్యం దెబ్బ తింటుంది. అందుకే సొంత భవనాలు నిర్మించాలని కోరారు.

మంచి భోజనం పెట్టాలి

హాస్టల్ విద్యార్థుల మెస్స్ చార్జీలు పెంచినందు వలన వారికి పాట మెనూ ప్రకారం కాకుండా పోషక పదార్థాలు గల ఆహారం పెట్టాలని కృష్ణయ్య కోరారు.అలాగే కాలేజి హాస్టల్ విద్యార్థులకు కూడా నెలకు 500 ప్యాకెట్ మని ఇవ్వాలని కోరారు.ఈ సమావేశం లో బిసి సంక్షేమ సంఘము రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పగడాల సుధాకర్ ముదిరాజ్,బి.సి.విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వేముల రామ కృష్ణ తదితరులు పాల్గొన్నారు

టి ఎస్ సివి యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షునిగా నక్కరాజు ముదిరాజ్

హైదరాబాద్ నవంబర్ 1: (ఎక్స్ ప్రెస్ న్యూస్); తెలంగాణ సామాజిక చైతన్య వేదిక రాష్ట్రస్థాయి కార్యకర్తల సమావేశం తెలంగాణ సామాజిక చైతన్య వేదిక రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించారు..

ఈ కార్యక్రమానికి తెలంగాణ సామాజిక చైతన్య వేదిక రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు, లాయర్స్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మునుగోడు నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ కంటెస్టెంట్ ఎంపీ అభ్యర్థి చౌటుప్పల్ కోర్ట్ అసోసియేషన్ లైబ్రరీ కార్యదర్శి హైకోర్టు ప్రముఖ న్యాయవాది నర్రి స్వామి కురుమ ముఖ్యఅతిథిగా హాజరైనారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సామాజిక చైతన్య వేదికను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించడంలో భాగంగా మెదక్ జిల్లా రామయనపేట మండలానికి చెందినా నక్కరాజు ముదిరాజ్ను తెలంగాణ సామాజిక చైతన్య వేదిక యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షునిగా నియమిస్తున్నట్లు ప్రకటిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం నక్క రాజు ముదిరాజ్ మాట్లాడుతూ నాకు టీఎస్సివి రాష్ట్ర ఉపాధ్యక్షునిగా బాధ్యతలని అప్పగించినందుకు నర్రి స్వామి,కి హృదయపూర్వక ధన్యవాదాములు నా శక్తి వంచన లేకుండా సంస్థ అభివృద్ధికి కృషి చేస్తానని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ సామాజిక చైతన్య వేదిక రాష్ట్ర నాయకులు,అనిమల శ్రీరాము,ముసం చంద్రశేఖర్,రామ ప్రతిజ్ఞ చారి, తెలంగాణ సామాజిక చైతన్య వేదిక జిల్లా అధ్యక్షుడు నక్క శ్రీను, శ్రీరామ్ నరసింహ,జగన్, ,తదితరులు పాల్గొన్నారు.

ఉదయసాహితి, తెలంగాణ

ప్రముఖ కవి శ్రీ గంప ఉమాపతి గారి

సాహిత్య సమాలోచన -15

సభాధ్యక్షులు

డా. పోరెడ్డి రంగయ్య
అధ్యక్షులు,
తేజ సాహిత్య సంస్థ

ముఖ్య అతిథి

శ్రీ మౌనశ్రీ మల్లిక్
ప్రముఖ కవి,టి.వి. సినిగేయ రచయిత

శ్రీ గంప ఉమాపతి
ప్రముఖ కవి

శ్రీ గంప ఉమాపతి గారి రచనలపై విశ్లేషకులు

ఎండుకిలా!?
(కవితా సంపుటి)



శ్రీ నంది శ్రీనివాస్
కవి, రచయిత

అలరుల అల్లరులు
(దీర్ఘ కవిత)

శ్రీ స్తంభంకాడి గంగాధర్
కవి, రచయిత

స్వాగత వచనాలు

శ్రీమతి మేరుగు అనురాధ
ప్రధాన కార్యదర్శి,ఉదయసాహితి, వరంగల్

వందనసమర్పణ

శ్రీమతి లక్ష్మి పద్మజ దుగ్గరాజు
మహిళాకార్యదర్శి, ఉదయసాహితి

ఆహ్వానించువారు:

దాస్యం సేనాధిపతి
రాష్ట్ర గౌరవాధ్యక్షులు
ఉదయసాహితి

శ్రీదాస్యం లక్ష్మయ్య
రాష్ట్ర అధ్యక్షులు,
ఉదయసాహితి

వురిమళ్ల సునంద
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
ఉదయసాహితి

నవంబర్ నెల మొదటి ఆదివారం తేది:03-11-2024

గూగుల్ మీట్ వేదికగా సాయంత్రం 6 గంటలకు

మన ప్రభుత్వం ప్రజాధనాన్ని ఆదా చేస్తోంది: ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ, నవంబర్ 1:ధన్వంతరి జయంతి, 9వ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా... ఈరోజు న్యూఢిల్లీలోని అఖిల భారత ఆయుర్వేద సంస్థ (ఏఐఐఏ)లో నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆరోగ్య రంగానికి సంబంధించి దాదాపు రూ.12,850 కోట్ల విలువైన వివిధ ప్రాజెక్టుల్లో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ కొన్నింటిని ప్రారంభించగా, మరికొన్నింటిని ఆవిష్కరించారు. అలాగే కొన్ని ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ... ధన్వంతరి జయంతి, దంతేరస్ సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ వేళ దాదాపుగా ప్రతి కుటుంబం ఏదైనా కొత్త వస్తువు కొనుగోలు చేస్తుందనీ, అందుకు దేశంలోని వ్యాపార యజమానులందరికీ ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే దీపావళి పండుగ కోసం అందరికీ ముందస్తుగా శుభాకాంక్షలు తెలిపారు.

అయోధ్యలోని శ్రీరాముని ఆలయం వేలాది దీపాల వెలుగులతో ప్రకాశిస్తూ ఈ వేడుకలను అపూర్వమైనవిగా మార్చిన క్రమంలో ఈ దీపావళిని చరిత్రాత్మకమైనదిగా ప్రధానమంత్రి అభివర్ణించారు. "ఈ సంవత్సరం దీపావళికి రాముడు మరోసారి తన ఇంటికి తిరిగి వచ్చాడు. అయితే చివరకు ఈ నిరీక్షణ 14 సంవత్సరాలకు కాదు, 500 సంవత్సరాల తర్వాత ముగిసింది" అని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు.

ఈ ఏడాది దంతేరస్ పండుగ శ్రేయస్సు, ఆరోగ్యాల సమ్మేళనంగానే కాకుండా భారతదేశ సంస్కృతి, జీవన తత్వానికి ప్రతీకగా ఉండడం యాదృచ్ఛికం కాదని శ్రీ నరేంద్ర మోదీ పేర్కొన్నారు. రుషులు, సాధువులూ ఆరోగ్యాన్ని మహోన్నత సంపదగా పరిగణిస్తారనీ, ఈ పురాతన భావన యోగా రూపంలో ప్రపంచ వ్యాప్తంగా ఆమోదం పొందుతోందని ప్రధాని తెలిపారు. ఈ రోజు 150కి పైగా దేశాల్లో ఆయుర్వేద దినోత్సవాన్ని జరుపుకోవడం పట్ల ప్రధానమంత్రి సంతోషం వ్యక్తం చేశారు. ఆయుర్వేదం పట్ల పెరుగుతున్న ఆదరణకూ, పురాతన కాలం నుంచి ప్రపంచానికి ఆయుర్వేదం ద్వారా భారత్ అందించిన సహకారానికీ ఇది నిదర్శనమని అన్నారు.

ఆయుర్వేద విజ్ఞానాన్ని ఆధునిక వైద్యంతో సమ్మిళితం చేయడం ద్వారా గడిచిన దశాబ్దంలో దేశ ఆరోగ్య రంగంలో నూతన అధ్యాయానికి నాంది పలికిన విషయాన్ని ప్రధానమంత్రి గుర్తు చేశారు. ఈ అధ్యాయానికి అఖిల భారత ఆయుర్వేద సంస్థ కేంద్ర స్థానంగా ఉందన్నారు. ఏడేళ్ల కిందట ఆయుర్వేద దినోత్సవం రోజున ఈ సంస్థ మొదటి దశను జాతికి అంకితం చేయడం తనకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాననీ, అలాగే ధన్వంతరి స్వామి ఆశీస్సులతో ఈ రోజు రెండో దశను సైతం ప్రారంభించడం సంతోషంగా ఉందని వ్యాఖ్యానించారు. ఆయుర్వేదం, వైద్య విజ్ఞాన రంగాల్లో అధునాతన పరిశోధన, అధ్యయనాలతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సమ్మిళితం చేసిన పంచకర్మ వంటి ప్రాచీన పద్ధతులను ఈ సంస్థలో చూడవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ పురోగతి పట్ల దేశ ప్రజలకు ఆయన అభినందనలు తెలిపారు.

ఒక దేశ పురోగతి నేరుగా ప్రజల ఆరోగ్యంతో ముడిపడి ఉంటుందని పేర్కొన్న ప్రధానమంత్రి... ప్రజల ఆరోగ్యానికి తమ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. ఆరోగ్య విధానం కోసం ఉద్దేశించిన అయిదు మూల స్తంభాలను ఆయన వివరించారు. నివారణాత్మక ఆరోగ్య సంరక్షణ, రోగాలను ముందుగానే గుర్తించడం, చికిత్స, మందులు ఉచితంగా, తక్కువ ఖర్చుతో అందుబాటులో ఉంచడం, చిన్న పట్టణాల్లోనూ వైద్యులు అందుబాటులో ఉండడం, చివరిగా ఆరోగ్య సేవల్లో సాంకేతికతను విస్తరించడం వంటి వాటిని అయిదు మూలస్తంభాలుగా అభివర్ణించారు. 'భారత్ ఆరోగ్య రంగాన్ని సంపూర్ణాత్మక ఆరోగ్యంగా చూస్తోంది' అని పేర్కొన్న ప్రధానమంత్రి... నేటి ప్రాజెక్టులు ఈ అయిదు మూల స్తంభాలను గురించి మనకు తెలియజేస్తాయన్నారు. 13,000 కోట్ల రూపాయలకు పైగా విలువైన ఈ ప్రాజెక్టుల ప్రారంభోత్సవం, శంకుస్థాపన సందర్భంగా, ఆయుష్ హెల్త్ స్కీమ్ కింద 4 ఎక్సెలెన్స్ సెంటర్ల ఏర్పాటు, డ్రోన్ల వినియోగంతో ఆరోగ్య సేవల విస్తరణ, రిషికేశ్‌లోని ఎయిమ్స్‌లో హెలికాప్టర్ సేవలు, న్యూఢిల్లీ, బిలాస్‌పూర్ ఎయిమ్స్‌లలో నూతన మౌలిక సదుపాయాలు, దేశంలోని మరో అయిదు ఇతర ఎయిమ్స్‌లలో సేవల విస్తరణ, వైద్య కళాశాలల స్థాపన, నర్సింగ్ కళాశాలలకు భూమి పూజ, ఆరోగ్య రంగానికి సంబంధించిన ఇతర ప్రాజెక్టుల గురించి ప్రధానమంత్రి ప్రస్తావించారు. కార్మికుల చికిత్స కోసం అనేక ఆసుపత్రులను నెలకొల్పడం పట్ల సంతోషం వ్యక్తం చేసిన ప్రధానమంత్రి... ఇది కార్మికుల చికిత్సా కేంద్రంగా మారుతుందన్నారు. అధునాతన ఔషధాలు, అధిక నాణ్యత గల స్టెంట్లు, వైద్య పరికరాల తయారీలో కీలకం కానున్న ఫార్మా యూనిట్ల ప్రారంభంతో దేశం మరింత అభివృద్ధి చెందుతోందని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

మనలో చాలా మంది అనారోగ్యం అంటే మొత్తం కుటుంబంపై మెరుపు దాడిగా భావించే నేపథ్యం నుంచి వచ్చినవారమేననీ, ముఖ్యంగా పేద కుటుంబంలో ఒక వ్యక్తి తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతుంటే, కుటుంబంలో ప్రతి సభ్యునిపై దాని ప్రభావం ఉంటుందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. వైద్యం కోసం ప్రజలు తమ ఇళ్లు, భూములు, నగలు, అన్నింటినీ అమ్ముకునే కాలం ఉండేదనీ, పేద ప్రజలు వారి కుటుంబ ఆరోగ్యం, ఇతర ప్రాధాన్యాల మధ్య ఏదైనా ఒకటే ఎంపిక చేసుకోవాల్సిన పరిస్థితుల్లో ఆదాయానికి మించిన ఖర్చులను భరించలేని పరిస్థితి ఉండేదన్నారు. పేదల నిరాశను దూరం చేసేందుకు, మా ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రవేశపెట్టిందనీ, పేదల ఆసుపత్రి ఖర్చులో రూ.5 లక్షల వరకు ప్రభుత్వమే భరిస్తుందని శ్రీ మోదీ స్పష్టం చేశారు. దేశంలోని దాదాపు 4 కోట్ల మంది పేదలు ఆయుష్మాన్ పథకం ద్వారా ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా చికిత్స అందుకుని లబ్ది పొందారని ప్రధానమంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఆయుష్మాన్ పథకం లబ్ధిదారులను తాను కలుసుకున్నప్పుడు, ఈ పథకంతో అనుబంధం గల వైద్యులు, పారామెడికల్ సిబ్బంది సహా ప్రతి వ్యక్తీ దీనిని ఒక వరంగా భావించడం సంతృప్తినిచ్చిందని శ్రీ నరేంద్ర మోదీ తెలిపారు.

ఆయుష్మాన్ పథక విస్తరణపై సంతృప్తి వ్యక్తం చేసిన శ్రీ మోదీ... ప్రతి వృద్ధుడు దాని కోసం ఎదురు చూస్తున్నారనీ, మూడోసారి అధికారంలోకి రాగానే 70 ఏళ్లు పైబడిన వృద్ధులందరినీ ఆయుష్మాన్ పరిధిలోకి తీసుకువస్తామన్న ఎన్నికల హామీ నెరవేరుతోందని అన్నారు. దేశంలోని 70 ఏళ్లు పైబడిన ప్రతి వృద్ధుడికీ ఆయుష్మాన్ వయ వందన కార్డు ద్వారా ఆసుపత్రుల్లో ఉచిత చికిత్స అందిస్తామని తెలిపారు. ఈ కార్డు సార్వత్రికమైనదని, పేద, మధ్యతరగతి, ఉన్నత వర్గాలు అనే తేడా లేకుండా, ఎలాంటి ఆదాయ పరిమితి లేకుండా దీనిని అందిస్తున్నట్లు ప్రధానమంత్రి స్పష్టం చేశారు. అందరికీ ఈ పథకాన్ని వర్తింపజేయడం గొప్ప విజయమనీ, వృద్ధుల కోసం అందించే ఆయుష్మాన్ వయ వందన కార్డుతో, అనేక కుటుంబాల్లో ఆదాయానికి మించిన ఖర్చు చాలా వరకు తగ్గుతుందని శ్రీ నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. ఈ పథకం ప్రారంభమైన క్రమంలో దేశ ప్రజలందరికీ ఆయన అభినందనలు తెలిపారు. ఢిల్లీ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలు ఈ పథకాన్ని అమలు చేయడం లేదని ఆయన తెలిపారు.

పేద, మధ్యతరగతి కుటుంబాల చికిత్స ఖర్చు తగ్గించడం పట్ల ప్రభుత్వ ప్రాధాన్యాన్ని పునరుద్ఘాటిస్తూ, 80 శాతం తగ్గింపు ధరతో ఔషధాలు అందుబాటులో ఉంచుతూ, దేశవ్యాప్తంగా 14 వేల పిఎమ్ జన్ ఔషధి కేంద్రాలు ఇప్పటికే ప్రారంభమైన విషయాన్ని ప్రధానమంత్రి ప్రస్తావించారు. పేద, మధ్యతరగతి ప్రజలకు చవక ధరలకు మందులు అందుబాటులోకి రావడంతో రూ.30 వేల కోట్లు ఆదా చేయగలిగామన్నారు. స్టెంట్లు, మోకాలి ఇంప్లాంట్లు వంటి పరికరాల ధరలను తగ్గించామనీ, తద్వారా సామాన్యులకు రూ. 80 వేల కోట్ల రూపాయలకు పైగా నష్టాన్ని నివారించగలిగామన్నారు. ప్రాణాంతక వ్యాధులను అరికట్టడంతో పాటు గర్భిణులు, నవజాత శిశువుల ప్రాణాలను కాపాడేందుకు గల ఉచిత దయాలసిస్ పథకం, మిషన్ ఇంద్రధనుష్ ప్రచారం గురించి కూడా ఆయన ప్రస్తావించారు. దేశంలోని పేద, మధ్యతరగతి ప్రజలు ఖరీదైన వైద్య చికిత్సల భారం నుంచి పూర్తిగా విముక్తి పొందే వరకూ తాను విశ్రమించబోనని ప్రధాని హామీ ఇచ్చారు.

అనారోగ్యాల వల్ల కలిగే నష్టాలను, ఇబ్బందులను తగ్గించడంలో సకాలంలో రోగనిర్ధారణ కీలకమైనదని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. సాధ్యమైనంత త్వరగా రోగ నిర్ధారణ చేసి, చికిత్సలను సత్వరమే అందించేందుకు దేశవ్యాప్తంగా రెండు లక్షలకు పైగా ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ఆరోగ్య మందిరాల వల్ల కోట్లాది మంది ప్రజలు క్యాన్సర్, రక్తపోటు, మధుమేహం వంటి వాటి విషయంలో వ్యాధి నిర్ధారణ పరీక్షలను సులభంగా చేయించుకుంటున్నట్లు చెప్పారు. సకాలంలో రోగనిర్ధారణ చేయడం ద్వారా సత్వరమే చికిత్స అందించే వీలుంటుందనీ, దీంతో రోగులకు ఖర్చులు తగ్గుతాయన్నారు. 30 కోట్ల మందికి పైగా ప్రజలు ఆన్‌లైన్‌లో వైద్యులను సంప్రదించిన ఈ-సంజీవని పథకం కింద ఆరోగ్య సంరక్షణను మెరుగుపరచడానికి, ప్రజాధనం ఆదా చేయడానికి ప్రభుత్వం సాంకేతికతను ఉపయోగించుకుంటోందని ప్రధానమంత్రి వివరించారు. "ఉచితంగా, సంబంధిత వైద్యులను సంప్రదించడం ద్వారా ఆరోగ్యం కోసం చేసే ఖర్చులు గణనీయంగా తగ్గాయి" అని ఆయన పేర్కొన్నారు. ఆరోగ్య రంగంలో ఆధునిక సాంకేతికతను జోడిస్తూ యూ-విన్ ప్లాట్‌ఫామ్‌ను ప్రారంభించినట్లు శ్రీ మోదీ ప్రకటించారు. "మహమ్మారి సమయంలో మన కో-విన్ ప్లాట్‌ఫామ్ సాధించిన విజయాన్ని ప్రపంచం చూసింది. యూపిఐ చెల్లింపు వ్యవస్థ విజయం ప్రపంచంలో ఒక ప్రధాన విజయగాథగా నిలిచింది" అని ఆయన అన్నారు. డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ద్వారా ఆరోగ్య రంగంలో ఈ విజయాన్ని పునరావృతం చేయడమే ఇప్పుడు మన ముందున్న లక్ష్యమని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

ఈ దశాబ్ద కాలానికి ముందు గత ఆరు నుంచి ఏడు దశాబ్దాల్లో సాధించిన పరిమిత విజయాలతో పోల్చితే, గడిచిన దశాబ్దంలో ఆరోగ్య సంరక్షణ రంగంలో మనం అపూర్వమైన పురోగతిని సాధించామని ప్రధానమంత్రి తెలిపారు. "గత 10 ఏళ్ల కాలంలో, రికార్డు సంఖ్యలో కొత్త ఎయిమ్స్, వైద్య కళాశాలల్ని స్థాపించడం మనం చూశాం" అని ఆయన పేర్కొన్నారు. నేటి సందర్భాన్ని ప్రస్తావిస్తూ, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్‌లలో ఆసుపత్రులను ప్రారంభించినట్లు ప్రధానమంత్రి తెలిపారు. కర్ణాటకలోని నర్సాపూర్, బొమ్మసంద్ర, మధ్యప్రదేశ్‌లోని పితంపూర్, ఆంధ్రప్రదేశ్‌లోని అచ్యుతాపురం, హర్యానాలోని ఫరీదాబాద్‌లలో కొత్త వైద్య కళాశాలలకు శంకుస్థాపన చేసిన విషయాన్ని గుర్తు చేశారు. "అదనంగా, ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో కొత్త ఈఎన్ఐసీ ఆసుపత్రి పనులు ప్రారంభమయ్యాయి. ఇండోర్‌లోనూ కొత్త ఆసుపత్రి ప్రారంభమైంది" అని ఆయన తెలిపారు. పెరుగుతున్న ఆసుపత్రుల సంఖ్య వైద్య సీట్లలో దామాషా పెరుగుదలను సూచిస్తోందని ప్రధానమంత్రి ఉద్ఘాటించారు. డాక్టర్ కావాలనే పేద పిల్లల కల ఇక చెదిరిపోదనీ, భారతదేశంలో తగినన్ని సీట్లు లేకపోవడం వల్ల మధ్యతరగతి విద్యార్థులు విదేశాలకు వెళ్లే అవసరం ఉండదనీ ఆయన స్పష్టం చేశారు. గడిచిన 10 ఏళ్ల కాలంలో కొత్తగా దాదాపు 1 లక్ష ఎంబీబీఎస్, ఎమ్‌డీ సీట్లు పెరిగాయని శ్రీ నరేంద్ర మోదీ తెలిపారు. రాబోయే అయిదేళ్లలో మరో 75 వేల సీట్లను పెంచేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు.

7.5 లక్షల మంది ఆయుష్ వైద్యులు ఇప్పటికే దేశ ఆరోగ్య సంరక్షణ కోసం తమవంతు సహకారాన్ని అందిస్తున్నారని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఈ సంఖ్యను మరింత పెంచాలని ఆయన స్పష్టం చేశారు. దేశంలో మెడికల్, వెల్‌నెస్ టూరిజం కోసం పెరుగుతున్న డిమాండ్‌ను ఆయన ప్రధానంగా ప్రస్తావించారు. భారతదేశం, విదేశాల్లో ప్రివెంటివ్ కార్డియాలజీ, ఆయుర్వేద ఆర్థోపెడిక్స్, ఆయుర్వేద పునరావాస కేంద్రాల వంటి రంగాలను విస్తరించేందుకు యువత, ఆయుష్ వైద్యులు సిద్ధం కావాలంటూ ఆయన పిలుపునిచ్చారు. "ఆయుష్ వైద్యుల కోసం అపారమైన అవకాశాలు అందుబాటులోకి వస్తున్నాయి. మన యువత ఈ అవకాశాల ద్వారా అభివృద్ధి చెందడమే కాకుండా మానవాళికి గొప్ప సేవను కూడా అందిస్తారు" అని ఆయన పేర్కొన్నారు.

21వ శతాబ్దంలో వైద్యరంగం వేగవంతమైన పురోగతినీ, గతంలో నయం చేయలేని వ్యాధుల చికిత్స విషయంలో నేడు సాధించిన పురోగతినీ ప్రధాని మోదీ ప్రధానంగా ప్రస్తావించారు. "ప్రపంచం చికిత్సతో పాటు శ్రేయస్సుకూ ప్రాధాన్యమిస్తున్న క్రమంలో, ఈ రంగంలో మన దేశం వేల సంవత్సరాల జ్ఞానాన్ని కలిగి ఉంది" అని ఆయన పేర్కొన్నారు. ఆయుర్వేద సూత్రాలను ఉపయోగించి వ్యక్తులకు ఆదర్శవంతమైన జీవనశైలి, వ్యాధుల ముప్పు విశ్లేషణలను రూపొందించే లక్ష్యంతో ప్రకృతి పరిరక్షణ అభియాన్‌ను ప్రారంభిస్తున్నట్లు ప్రధానమంత్రి ప్రకటించారు. ఈ కార్యక్రమం ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య సంరక్షణ రంగాన్ని నవీకరించడంతో పాటు, మొత్తం ప్రపంచానికి సరికొత్త దృక్పథాన్ని అందించగలదని ఆయన స్పష్టం చేశారు.

అశ్వగంధ, పసుపు, నల్ల మిరియాలు వంటి సంప్రదాయ మూలికలను అధిక-ప్రభావవంతమైన శాస్త్రీయ అధ్యయనాల ద్వారా ధ్రువీకరించాల్సిన అవసరముందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. "మన సంప్రదాయ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలను ప్రయోగశాలల్లో ధ్రువీకరిస్తే ఈ మూలికల విలువ పెరగడంతో పాటు గణనీయమైన మార్కెట్ కూడా ఏర్పడుతుంది" అని ఆయన వ్యాఖ్యానించారు. అశ్వగంధకు పెరుగుతున్న డిమాండ్‌ను సూచిస్తూ... ఈ దశాబ్దం చివరి నాటికి దీని మార్కెట్ విలువ 2.5 బిలియన్ డాలర్లకు చేరుకోగలదనే అంచనాలను ఆయన ప్రస్తావించారు.

ఆయుష్ విజయం ఆరోగ్య రంగాన్ని మాత్రమే కాకుండా ఆర్థిక వ్యవస్థనూ ప్రభావితం చేస్తోందని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. ఆయుష్ తయారీ రంగం 2014లో 3 బిలియన్ డాలర్ల నుంచి దాదాపు 24 బిలియన్ డాలర్లకు పెరిగిందన్నారు. ఇది కేవలం 10 ఏళ్లలో 8 రెట్లు పెరిగిందని తెలిపారు. భారతదేశంలో ఇప్పుడు 900 లకు పైగా ఆయుష్ అంకుర సంస్థలు పనిచేస్తూ, యువతకు కొత్త అవకాశాలను కల్పిస్తున్నాయని ఆయన తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా 150 దేశాలకు ఆయుష్ ఉత్పత్తుల ఎగుమతి జరుగుతోందని పేర్కొన్న ప్రధానమంత్రి, స్థానిక మూలికలు, సూపర్‌ఫుడ్‌లను ప్రపంచస్థాయి సరుకులుగా మార్చడం ద్వారా భారతీయ రైతులకు ప్రయోజనం కలిగిస్తున్నట్లు ప్రధానమంత్రి స్పష్టం చేశారు. గంగానది తీరం వెంబడి సేంద్రియ వ్యవసాయం, మూలికల సాగును ప్రోత్సహించే నమామి గంగే ప్రాజెక్ట్ వంటి కార్యక్రమాలను కూడా ఆయన ప్రధానంగా ప్రస్తావించారు.

ఆరోగ్యం, శ్రేయస్సు పట్ల భారతదేశ నిబద్ధతను ప్రతిబింబిస్తూ, భారత జాతీయ స్వభావానికి, సామాజిక స్వరూపానికి ఇది ఆత్మ వంటిదని శ్రీ మోదీ అన్నారు. గత 10 ఏళ్ల కాలంలో ప్రభుత్వం 'సబ్ కా సాత్, సబ్ కా వికాస్' విధానంతో దేశ విధానాలను సమ్మిళితం చేసిందని ఆయన ఉద్ఘాటించారు. "రాబోయే 25 ఏళ్లలో, ఈ ప్రయత్నాలు అభివృద్ధి చెందిన, ఆరోగ్యకరమైన భారతదేశానికి బలమైన పునాది వేస్తాయి" అని పేర్కొంటూ శ్రీ మోదీ తన ప్రసంగాన్ని ముగించారు.

కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి శ్రీ జే పీ నడ్డా, కార్మిక, ఉపాధి, యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ మన్‌సుఖ్ మాండవీయ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రధాన పథకం అయిన ఆయుష్మాన్ భారత్ ప్రధాన్ మంత్రి జన్ ఆరోగ్య యోజన (పిఎమ్-జెఎవై)ని విస్తరిస్తూ, 70 ఏళ్లు పైబడిన వృద్ధులందరికీ ఉచిత వైద్యం అందించే పథకాన్ని ప్రధానమంత్రి ప్రారంభించారు. ఇది వారి ఆదాయంతో సంబంధం లేకుండా వృద్ధులందరికీ ఆరోగ్య కవరేజీని అందించడంలో సహాయపడుతుంది.

దేశవ్యాప్తంగా నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ సేవలను అందించడం కోసం ప్రధానమంత్రి నిరంతరం కృషి చేస్తున్నారు.

ఆరోగ్య సంరక్షణ రంగంలో మౌలిక వసతులను మెరుగురచడం కోసం ప్రధానమంత్రి పలు ఆరోగ్య సంరక్షణ సంస్థలను ప్రారంభించి, శంకుస్థాపనలు చేశారు.

దేశంలో మొదటి అఖిల భారత ఆయుర్వేద సంస్థ రెండో దశను ప్రధానమంత్రి ప్రారంభించారు. ఇందులో పంచకర్మ ఆసుపత్రి, ఔషధాల తయారీకి ఆయుర్వేద ఫార్మసీ, స్పోర్ట్స్ మెడిసిన్ యూనిట్, సెంట్రల్ లైబ్రరీ, ఐటీ, అంకురసంస్థల ఇంక్యుబేషన్ సెంటర్, 500 సీట్లు గల ఆడిటోరియం ఉన్నాయి. మధ్యప్రదేశ్‌లోని మందసౌర్, నీముచ్, సియోనిలలో మూడు వైద్య కళాశాలలను కూడా ఆయన ప్రారంభించారు.

ఇంకా, హిమాచల్ ప్రదేశ్‌లోని బిలాస్‌పూర్, పశ్చిమ బెంగాల్‌లోని కళ్యాణి, బీహార్‌లోని పాట్నా, ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్, మధ్యప్రదేశ్‌లోని భోపాల్, అస్సాంలోని గౌహతి, న్యూఢిల్లీలోని వివిధ ఎయిమ్స్‌లలో సౌకర్యాలు, సేవల విస్తరణ పనులను ఆయన ప్రారంభించారు. ఇందులో జన ఔషధీ కేంద్రాలు కూడా ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్ ప్రభుత్వ వైద్య కళాశాలలో సూపర్ స్పెషాలిటీ విభాగాన్ని, ఒడిశాలోని బార్‌గఢ్‌లో క్రిటికల్ కేర్ విభాగాన్ని కూడా ప్రధాని ప్రారంభించారు.

మధ్యప్రదేశ్‌లోని శివపురి, రత్లాం, ఖాండ్వా, రాజ్‌గఢ్, మందసౌర్‌లలో అయిదు నర్సింగ్ కళాశాలలకు ప్రధానమంత్రి శంకుస్థాపన చేశారు.



దివాళి పండుగ సందర్భంగా జవాన్లకు మిఠాయిలు తినిపించిన ప్రధాని మోడీ

నేవ్ఢిల్లీ నవంబర్ 1 (ఎక్స్ ప్రెస్ న్యూస్);ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మరోసారి జవాన్లతో కలిసి దీపావళి వేడకల్లో పాల్గొన్నారు. గురువారం దివాళి ఫెస్టివల్ సందర్భంగా ప్రధాని వెూడీ జవాన్లకు మిఠాయిలు తినిపించారు. గుజరాత్ పర్యటనలో ఉన్న ప్రధాని అక్కడి కచ్ ప్రాంతంలో విధులు నిర్వర్తిస్తున్న సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) జవాన్లతో కలిసి దివాళి సెలబ్రేషన్స్ చేసుకున్నారు. కచ్‌లోని సర్ క్రీక్ ప్రాంతంలోని లక్కీ నాలా వద్ద గస్తీ కాస్తున్న జవాన్లకు ప్రధాని బీఎస్ఎఫ్ యూనిఫాం ధరించి మిఠాయిలు తినిపించి పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. కాగా, ప్రతి సంవత్సరం దీపావళి పండగను పురస్కరించుకుని దేశ సరిహద్దులో జవాన్లతో కలిసి వేడుకలు చేసుకుంటున్న సంగతి తెలిసిందే. అంతకుముందు, దేశ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. "దీపావళి సందర్భంగా దేశప్రజలకు శుభాకాంక్షలు. ఈ దివ్య దీపాల పండుగ సందర్భంగా, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా, సంతోషకరమైన, సంపన్నమైన జీవితాన్ని గడపాలని కోరుకుంటున్నాను. మా లక్ష్మి, శ్రీ గణేశుడి ఆశీస్సులతో ప్రతి ఒక్కరూ వర్ధిల్లాలని కోరుకుంటున్నాను" అని ప్రధాని ఎక్స్ లో పోస్ట్ చేశా

రాజ్య హింసకు,బూటకపు ఎన్కౌంటర్ వ్యతిరేకంగా అమర వీరుల వారోత్సవాలు

- సిపిఐ(యం ఎల్) సీ పీ రెడ్డి పార్టీ కార్యదర్శి మల్లేపల్లి ప్రభాకర్

సంగా రెడ్డి అక్టోబర్ 31.(ఎక్స్ ప్రెస్ న్యూస్);భూమి భుక్తి విముక్తి కోసం తమ అమూల్యమైన ప్రాణాలను సైతం త్యాగం చేసి బూటకపు ఎన్కౌంటర్,వివిధ సందర్భంలో పీడిత ప్రజల పక్షాన నిలిచి ప్రాణాలను త్యాగం చేసిన అమరవీరుల సంస్మరణ సభ లు నవంబర్ 1 నుండి 30 వరకు దేశ వ్యాప్తంగా నిర్వహించాలని సీపీఐ(యం ఎల్) సీపీ పార్టీ జాతీయ కార్యదర్శి మల్లేపల్లి ప్రభాకర్ పిలుపు నిచ్చారు కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు, కషాయి కరణకు మద్దతు పలుకుతూ దేశం లో అశేష ప్రజానీకానికి కనీస మౌ లికా హక్కులను కలరస్తు ప్రజలను జీవించే హక్కుల నుండి దూరం చేస్తూ ఎస్సీ ఎస్టీ మైనార్టీ ఆదివాసీ ప్రజలను కందీ షికులుగా మారుస్తూ కేవలం ,బ్రాహ్మణీయ,హిందూ,సనాతన ధర్మం పేరుతో రాజకీయాలు నడిపిస్తున్న మోడీ ,విధానాలను తిప్పి కొట్టాలని కోరారు.దండకారణ్యం లో ఉన్న అపారమైన మూడి నరుకు దోచుకోవడం కోసం ,అడివి బిడ్డలను అడ్డం పెట్టుకొని మావోయిస్టు పేర్లతో ఆదివాసీలను కాల్చి చంపుతున్నారు , ఈ రాజ్యహింసలను వ్యేతిరే కించే వారిని అర్బన్ నక్సలైట్ పెర్ల మీద జైలో పెడ్తూ, దేశం లో అప్రకటిత యుద్ధ నీ కొనసాగిస్తున్నది.ఈ దళారి ,దోపిడీ, పాలక వర్గాలకు వ్యేతి రేకంగా దోపిడీ రహిత సమసమాజం కోసం అమరులు చూపినా దారిలో విప్లవ ఐక్య ఉద్యమాలు నిర్వహిం చాలన్నారు ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా పార్టీ నాయకులు రామన్న, రియాజ్,పద్మ ,రాజునాయక్ తదితరాలు పాల్గొన్నారు

సినీ ఫక్కీ తరహాలో గంజాయి తరలింపు

290 కేజీలు, రూ. 72 లక్షల 50 వేల విలువగల గంజాయి పట్టివేత

ఆసిఫాబాద్ నవంబర్ 1 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: సినీఫక్కీ తరహాలో లారి ఆయిల్ ట్యాంకర్ లో అక్రమంగా తరలిస్తున్న 72 లక్షల విలువ గల గంజాయిని పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. జిల్లా ఎస్పీ డీ వి శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం? మహారాష్ట్ర లోని అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర సరిహద్దు లో చెక్ పోస్ట్ ఏర్పాటు చేయడం జరిగిందని, అందులో భాగంగా పోలీసులు వాహనాలను తనిఖీ చేయడంతో ఆంధ్రప్రదేశ్ లోని రాజమండ్రి నుంచి మధ్యప్రదేశ్ కి ఆయిల్ ట్యాంకర్ లో తరలిస్తున్న 290 కిలోల గంజాయిని పట్టుకున్నామని వివరించారు. ఎంపి 06 హెచ్ సి 1339 అనే నంబరు గల లారీ ఆసిఫాబాద్ వైపు నుండి మహారాష్ట్ర వైపుకు వెళ్తుండగా వాహనాన్ని పోలీసులు ఆపారు. లారీ డ్రైవర్ అనుమానాస్పదంగా కన్పించడంతో వాహనాన్ని తనిఖీ చేయడంతో భారీ మొత్తంలో గంజాయి లభ్యమైంది. నిందితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన అరబింద్ అనే వ్యక్తి తనను గంజాయి సరఫరా కోసం రాజమండ్రికి పంపాడని, గంజాయిని అక్కడ లోడ్ చేసుకుని తిరిగి వస్తున్న క్రమంలో వాంకిడిలో పట్టుబడినట్లు తెలిపాడు

డాక్టర్ ఎ.యస్ రావుకు 21వ వర్ధంతి సందర్భముగా ఘన నివాళులు

హైదరాబాద్, నవంబర్ 1:31-10-24వ తేదీ ఉదయం ఎ యస్ రావునగర్ లో డాక్టర్ ఎ యస్ రావునగర్ నివాసుల సంక్షేమ మరియు సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో ఎ యస్ రావు గారి 21వ వర్ధంతి సందర్భంగా అతిథులు, ఐదుగురు కవులు మరియు వక్తృత్వపు పోటీలో గెలుపొందిన నలుగురు అణు విద్యుత్ పాఠశాల విద్యార్థులు ఘన నివాళులు అర్పించారు. మొదట సంఘ నిర్వాహకుడు శ్రీ శంకరరావు గారు అతిథులను వేదికపైకి ఆహ్వానించారు.సభాధ్యక్షుడు శ్రీ బులుసు భాస్కరరావు గారు సంస్థ మరియు సంస్థ ఉద్యోగులు ఎ యస్ రావు గారికి ఎంతో ఋణపడి ఉన్నారన్నారు. ముఖ్య అతిథి శ్రీ వి కె ప్రేమచంద్ గారు శ్రీ రావు గారితో వారికున్న అనుబంధాన్ని 1930 వ దశకం నుండి 2000 వ దశకం వరకు సోదాహరంగా వివరించారు. శ్రీ రావు గారి ఆశయాలను భావాలను మహోన్నత వ్యక్తిత్వాన్ని తెలియపరిచారు.

కాప్రా మల్కాజిగిరి కవుల వేదిక తరఫున ఐదుగురు కవులు పాల్గొని శ్రీ రావు గారికి గేయార్చనచేశారు. డాక్టర్ రాధా కుసుమ గారు జోహారు జోహారు ఎ యస్ రావు గారు, ఓ కార్యసాధకుడా అంటు చక్కగా పాడారు. పిమ్మట డాక్టర్ దీపక్ న్యాతి గారు అదిగో అదిగో అదిగదిగో నింగిని వెలుగుతుంది ఓ చుక్కా మనవైపే చూస్తుంది ఏ చక్కా అని పాడి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. కవయిత్రి శ్రీమతి దీకొండ చంద్రకళ వందనం వందనం అభివందనం అంటూ చక్కని స్వరంతో అద్భుతంగా పాడారు. కవయిత్రి శ్రీమతి ధనమ్మ రెడ్డి పుడితే నీలా పుట్టాలి ఓ సారు, జీవిస్తే నీలా బతకాలి ఓ ఎ యస్ రావు సారు అంటు పాటను వినిపించారు. కవుల వేదిక నిర్వాహకుడు శ్రీ గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్ మహనీయుడు, నిరాడంబరుడు, తెలివైనవాడు, మన తెలుగువాడు అంటూ గేయాన్ని ఆలపించి ఎ యస్ రావు గారికి హాజరయిన వారందరితో జోహారులు కొట్టించారు.

తర్వాత వక్తృత్వపు పోటీలో గెలుపొందిన నలుగురు విద్యార్థులు చక్కగా మాట్లాడి తమ వాగ్ధాటితో అందరిని అలరించారు. అతిథులను, కవులను మరియు విధ్యార్థులను మెమోంటోలు ఇచ్చి సత్కరించారు. శ్రీ టి శ్రీనివాస్ గారి వందన సమర్పణతో సమావేశం ముగిసింది.

సయ్యద్, పఠాన్, మొగల్, షాఫాయి తెగలను సైతం బిసిఈ లో కలపండి

-బీసీబి కి చెందిన వారిని బీసీఈ లో సర్టిఫికెట్లు .. పొందకుండా చర్యలు చేపట్టండి

-ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలో బీసీ కమిషన్ కు వినతిపత్రం

కరీంనగర్, నవంబర్ 1: (నేటినిజం ప్రతినిధి) సయ్యద్, పఠాన్, మొగల్, షాఫాయి అనే ముస్లిం తెగలను ఏప్రాతిపదికన 4శాతం రిజర్వేషన్ల నుంచి తొలగించారో స్పష్టం చేయాలని, ఎలాంటి కారణం లేకుండా కేవలం ఒకే ఒక్క షేక్ తెగతో పాటు కొన్ని ముస్లిం తెగలను మాత్రమే అప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం ముస్లింలను సంతృప్తి పరచడానికి 10శాతం అని చెప్పి, 4శాతమే రిజర్వేషన్లు కల్పించి, పైన తెలిపిన నాలుగు మెజారిటీ తెగలను 4శాతం బీసీఈ రిజర్వేషన్ల కల్పన నుంచి పక్కన పెట్టడాన్ని తీవ్రంగా పరిగణిస్తూ.. ఏఐఎంఐఎం పార్టీ కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఆపార్టీ కార్పొరేటర్లు నాయకులు బీసీ కమిషన్ చైర్ పర్సన్ కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఎంఐఎం పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ ఆదేశాల మేరకు కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియంలో స్థానిక సంస్థల రిజర్వేషన్లు కల్పనపై నిర్వహించిన బీసీ కమిషన్ బహిరంగ విచారణకు హాజరై ముస్లింల ఆవేదనను వినిపించారు. ఈ సందర్భంగా గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల తరహాలో బీసీ బి నీ మినహాయించి ముస్లింల అందర్నీ బీసీ ఈలో కలపాలని డిమాండ్ చేశారు. గత 15 సంవత్సరాలుగా కేవలం ఒకే ఒక్క షేక్ తెగకు సంబంధించిన వారితో పాటు కొన్ని సంచార జాతుల వారికి ఈ బీసీ రిజర్వేషన్లు అమలు అవుతున్నాయని ముస్లింలలో సయ్యద్, పఠాన్, మొగల్, షాఫాయి తెగలకు సంబంధించిన వారు మెజార్టీగా పేదరికంలో దారిద్ర రేఖకు దిగువన ఉండి దుర్భర జీవితం గడుపుతున్నారని, ఈ నాలుగు తెగలలో పేదలుగా ఉన్న వారిని గుర్తించి బీసీలు రిజర్వేషన్లు కల్పించాలని, చాలావరకు ఈ నాలుగు తెగలకు సంబంధించిన వారు విద్యా, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో తీవ్రంగా నష్టపోతున్నారని వివరించారు. బీసీబి ముస్లిం తెగ వారిని బీసీఈ లో సర్టిఫికెట్లు పొందడాన్ని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, జిల్లా కలెక్టర్, రెవెన్యూ యంత్రాంగం దృష్టి సారించి నిరోధించేట్లు తక్షణ కర్తవ్యంగా చర్యలు చేపట్టాలని కోరారు. బీసీబీ రిజర్వేషన్లో చదువుకొని కేవలం ఉద్యోగాల కోసం మాత్రమే బీసీఈలో దొంగ చాటున సర్టిఫికెట్లను పొందడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నట్లు, ఇందులో కొంతమంది రెవెన్యూ అధికారులు లంచాలు పుచ్చుకొని సరైన విచారణ జరపకుండానే బిసిబి ముస్లిం తేగవారిని బీసీఈ లో సర్టిఫికెట్ ఇస్తున్నారని, దీనిని తీవ్రంగా పరిగణించాలని కోరుతూ తన అభిప్రాయాన్ని బీసీ కమిషన్ ఎదుట వెల్లడించారు. తక్షణమే స్పందించిన బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ ఎంఐఎం పార్టీ చేసిన విజ్ఞప్తులను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. సయ్యద్, పఠాన్, మొగల్, షాఫాయి తెగలను బీసీఈ లో కలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నివేదిస్తామన్నారు. అలాగే బీసీబి ముస్లిం తెగకు సంబంధించిన వారిని బిసిఈ లో సర్టిఫికెట్లు పొందకుండా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దృష్టికి తీసుకెళ్తామని, కరీంనగర్ జిల్లాలో సైతం ఈసర్టిఫికెట్లు తప్పుదోవలో తీసుకోకుండా నిరోధించాలని జిల్లా కలెక్టర్ ను ఆదేశించినట్లు గులాం అహ్మద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ,ఎంఐఎం నగర ప్రధాన కార్యదర్శి సయ్యద్ బర్కత్ అలీ, జాయింట్ సెక్రటరీలు సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రి యూసుఫ్, ఆతిన అతిఫ్, ఖమరుద్దీన్, కోశాధికారి ఇబ్రహీం, కోకార్పొరేటర్లు అలీ బాబా, అజర్ దబీర్ తదితరులు

రాష్ట్రంలో చాలా పకడ్బందీగా కులగణన

కరీంనగర్, నవంబర్ 01 (ఎక్స్ ప్రెస్ న్యూస్):: రాష్ట్రంలో కులగణనను చాలా పకడ్బందీగా నిర్వహిస్తామని తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ స్పష్టం చేశారు. ఈ కులగణన సందర్భంగా తప్పుడు సమాచారం ఇచ్చినా.. తప్పుడు సమాచారం నమోదు చేసినా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. శుక్రవారం కరీంనగర్‌లో నిరంజన్ మాట్లాడుతూ.. కులగణన ద్వారా అన్ని కులాల సామాజిక ఆర్థిక పరిస్థితిని తెలుసుకుంటామన్నారు.కులగణన ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడూ జరిగేది కాదని ఆయన పేర్కొన్నారు. బీసీ కమిషన్ ముందు స్పష్టమైన వివరాలు ఇవ్వాలని ప్రజలకు ఈ సందర్భంగా ఆయన సూచించారు. అయితే సరైన నివేదిక ఇవ్వకపోతే ఆ కులమే తీవ్రంగా నష్ట పోతుందని ఈ సందర్భంగా ప్రజలకు ఆయన సూచించారు. అలాగే కులగణన నేపథ్యంలో బీసీ కమిషన్‌కు ఆటంకాలు కలిగించ వద్దని ప్రజలకు తెలిపారు.

ఈ అంశంపై కొందరు భవిష్యత్‌లో కోర్టుకు కూడా వెళ్లే అవకాశముందని ఆయన అభిప్రాయపడ్డారు. అందుకే ఎక్కడ తప్పు జరగకుండా.. ఎవరి ఒత్తిళ్లకు లొంగకుండా జాగ్రత్త పడుతున్నామన్నారు. అయితే బీసీ కమిషన్ ఏ ఒక్క పార్టీకి చెందినది కాదని ఆయన కుండ బద్దలు కొట్టారు.ఎవరికీ తాము భయపడమన్నారు. న్యాయస్థానాల పట్ల తమకు గౌరవం ఉందని చెప్పారు. న్యాయస్థానాల ఆదేశాలను తాము తప్పక పాటిస్తామని తెలిపారు. ఈ కులగణనతో బీసీలే కాదు..

ఎవరి లెక్క ఎంతో తెలిసి పోతుందన్నారు. ఇక సుప్రీంకోర్టు ఆర్డర్ కాపీ ఇంకా బీసీ కమిషన్‌కు చేరలేదన్నారు. వివిధ కులాలను వేరే గ్రూపుల్లోకి మార్చాలని పలువురు కోరుతున్నారని.. ఈ అంశంపై త్వరలోనే ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని చెప్పారు.

అయితే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తొలినాళ్లలో నాటి కేసీఆర్ సారథ్యంలోని టీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే ఎక్కడ ఉందో తెలియదని వ్యంగ్యంగా అన్నారు. ఆ వివరాలు ఏమయ్యాయో ఆ దేవుడికే తెలుసునన్నారు.

కానీ తాము అలాంటి తప్పు ముమ్మాటికి చేయమని బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ స్పష్టం చేశారు.రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం నవంబర్ 6వ తేదీ నుంచి కులగణన చేపట్టనుంది. ఇది నవంబర్ 30వ తేదీతో ముగియనుంది. అయితే కులగణనపై పార్టీ నేతలతో సీఎం రేవంత్ రెడ్డి గురువారం గాంధీ భవన్‌లో సమావేశమయ్యారు. నవంబర్ నెలాఖరుకు ఈ కులగణన పూర్తి చేసి.. స్థానిక సంస్థలకు వెళ్దామని పార్టీ శ్రేణులకు ఈ సందర్భంగా సీఎం రేవంత్ పిలుపు నిచ్చిన విషయం తెలిసిందే.అలాగే ఈ కులగణన అనేది ఎక్స్ రే మాత్రమే కాదని.. హెల్త్ చెకప్ లాంటిందని కూడా సీఎం రేవంత్ అభివర్ణించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ కులగణన చేపడతామని ప్రకటించిన సంగతి తెలిసిందే. మరోవైపు దేశంలో తొలిసారిగా తెలంగాణలో కులగణనను ప్రభుత్వం చేపట్టనుంది.

తెలంగాణలో కొత్త ముఖ్యమంత్రి కోసం కాంగ్రెస్ అధిష్టానం అన్వేషిస్తోంది

– ముఖ్యమంత్రి పదవి రేసులో ఉత్తమ్, కోమటిరెడ్డి, భట్టి విక్రమార్క

– కేసీఆర్ టచ్లో ఉన్నా కాంగ్రెస్ లో చేరిన ఐదుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

– బీజేఎల్పీ, నేత మహేశ్వర్ రెడ్డి సంచలని కామెంట్స్

హైదరాబాద్ నవంబర్ 1 (ఎక్స్ ప్రెస్ న్యూస్):: తెలంగాణలో కొత్త ముఖ్యమంత్రి కోసం కాంగ్రెస్ అధిష్టానం అన్వేషిస్తోందని రేవంత్ కు కౌంట్ డౌన్ మొదలైంది అంటూ బీజేఎల్పీ, నేత మహేశ్వర్ రెడ్డి సంచలని కామెంట్స్ చేశారు సీఎం రేవంత్ సీనియర్ మంత్రులు, ఒరిజినల్ కాంగ్రెస్ నేతలు అధిష్టానానికి ఫిర్యాదు చేస్తున్నారు. రేవంత్ హాలీడే పీరియడ్ అయిపోయింది. ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.శుక్రవారం మీడియా తో చిట్చాల్లో.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాహుల్ గాంధీ అపాయింట్మెంట్ ఇవ్వడం లేదు. రేవంత్ హాలీడే పీరియడ్ అయిపోయింది.. కౌంట్ డౌన్ మొదలైంది. 2025 జూన్ నుంచి డిసెంబర్ లోపు రేవంత్ పదవి పోవడం యం. రేవంత్ రెడ్డికి ప్రత్యామ్నాయ కోసం కాంగ్రెస్ అధిష్టానం చూస్తోంది. ఒరిజినల్ కాంగ్రెస్ నేతలు రేవంత్ పై అధిష్టానానికి ఫిర్యాదు చేస్తున్నారు. రేవంత్ వ్యతిరేక వర్గం ఢిల్లీలో లాబీయింగ్ చేస్తున్నారు. మేనిపెస్టోను కాదు అని.. సొంత ఎజెండాను రేవంత్ అమలు చేస్తున్నారు. కేంద్ర మాజీ మంత్రి పళ్లంరాజు.. సోనియా గాంధీకి పిర్యాదు చేశారు. సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యామ్నాయం ఎవరు అని కాంగ్రెస్ అధిష్టానం ఆలోచన చేస్తోందని పేర్కొన్నారు.సీనియర్ మంత్రులు హైడ్రా, మూసీ, ల్యాండ్ సెటిల్మెంట్ల మీద రేవంత్ పై పిర్యాదు చేసినట్లు మా దగ్గర సాక్ష్యాలు ఉన్నాయి. సీనియర్ మంత్రులు చేసిన నిర్యాదుపై కాంగ్రెస్ అదిష్టానం సీరియస్గా ఉంది. మూసీ ప్రాజెక్టు కాస్ట్ మూడు వంతులు పెంచి.. రేవంత్ స్వార్థం కోసం కాంగ్రెస్ ను వాడుకుంటున్నారు. సీఎం రేవంత్ ఏకపక్ష ధోరణికి చాలా మంది నేతలు ఒప్పుకోవడం లేదు. రేవంత్ ఏడు సార్లు ఢిల్లీకి వెళ్లినా రాహుల్ అపాయింట్ మెంట్ ఇవ్వడం లేదు. 11 నెలలు దాటింది.. ఏడాదిన్నరలోపే కాంగ్రెస్ కొత్త ముఖ్యమంత్రి రావడం.. భట్టి విక్రమార్క నేను సైతం సీఎం రేసులో ఉన్నానని చెప్పడానికి

చెరువుల కబ్జాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వడమే ఇందుకు ఉదాహరణ అని అన్నారు. ముగ్గురు మంత్రులు సీఎం రేసులో పోటీ పడుతున్నారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వక్కా నమాచారంతోనే మాట్లాడారు.. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రి అవుతాడు అని.. నా నాలుకపై పుట్టుమచ్చ ఉందని ముందుగానే పసిగట్టి ఆయన ఇలా మాట్లాడారు. ముఖ్యమంత్రి పదవి రేసులో ఉత్తమ్, కోమటిరెడ్డి, భట్టి విక్రమార్క ముగ్గురూ పడుతున్నారు. అలాగే, కాంగ్రెస్లో చేరిన ఐదుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేసీఆర్తో టచ్లో ఉన్నారన్నారు.

పాదయాత్ర చేస్తా అనడానికి సిగ్గు ఉండాలి – కేంద్రమంత్రి బండి సంజయ్

కరీంనగర్, నవంబర్ 1 (ఎక్స్ ప్రెస్ న్యూస్):: పార్టీ కార్యకర్తల ఆకాంక్షల మేరకు రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేస్తానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. అయితే కేటీఆర్ పాదయాత్ర వార్తలపై కేంద్రమంత్రి బండి సంజయ్ స్పందిస్తూ ఆయనపై విమర్శలు గుప్పించారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. పాదయాత్ర చేస్తా అనడానికి సిగ్గు ఉండాలన్నారు. ఏం ఉద్ధరించారని పాదయాత్ర చేస్తా అంటున్నవ్ కేటీఆర్ అని ప్రశ్నించారు. "మేం పాదయాత్ర చేస్తే దాడులు చేశారు. ముందు కేసీఆర్‌ను ఫామ్ హౌస్ నుంచి బయటకు రమ్మను. తాగి, తింటూ కేసీఆర్ ఎంజాయ్ చేస్తున్నాడు. నాయకుడు లేని నావ బీఆర్ఎస్. కేటీఆర్‌ను జనం చీధరించుకుంటున్నారు" అంటూ వ్యాఖ్యలు చేశారు.ఆరు గ్యారంటీలను అమలు చేశామని పాదయాత్ర చేసే దమ్ము కాంగ్రెస్కు ఉందా అని ప్రశ్నించారు. రైతు భరోసా ఉందో లేదో తెల్వదని. బోనస్ ఇస్తారో లేదో చెప్పరని మండిపడ్డారు. 29 జీవోను రద్దు చేయకపోతే ఊరుకోమని హెచ్చరించారు. ఏడాది పాలనలో ఒక్క హామీ అమలు కాలేదన్నారు. కర్ణాటకలో ఉచిత బస్సు పథకం రద్దు చేస్తున్నారన్నారు. దీపావళికి ఏవో బాంబులన్నారని.. ఇప్పుడు సైలెంట్ అయ్యారన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒక్కటే.. స్కాములన్నీ ఏమయ్యాయో చెప్పాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

పార్టీ కార్యకర్తల ఆకాంక్షల మేరకు రాష్ట్రవ్యాప్తంగా కేటీఆర్ పాదయాత్ర..

హైదరాబాద్ నవంబర్ 1 (ఎక్స్ ప్రెస్ న్యూస్); తెలంగాణ వ్యాప్తంగా పాదయాత్ర చేయాలని మాజీ మంత్రి కేటీఆర్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. పార్టీ కార్యకర్తల ఆకాంక్షల మేరకు రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేస్తానని ఆయన చెబుతున్నారు. ఈ విషయాన్ని సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ప్రజలతో కేటీఆర్ స్పష్టం చేశారు. సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ప్రజలతో సంభాషించారు కేటీఆర్. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణకు శాపంగా మారిందని విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ పార్టీ పాలన ఫ్రమ్ ఢిల్లీ, టూ ఢిల్లీ, ఫర్ ఢిల్లీ అన్నట్లుగా తయారైందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పాలనలో జరిగిన పతనం నుంచి తెలంగాణ కోలుకోవడం అసాధ్యమని చెప్పుకొచ్చారు.

ఘనంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు...

-రైకుర్తి – కొత్తపల్లి రహదారికి సర్దార్ పటేల్ మార్గ్ గా నామకరణం....

కరీంనగర్, నవంబర్ 1: (నేటినిజం ప్రతినిధి) సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతోత్సవ సమితి ఆధ్వర్యంలో కరీంనగర్లోని సహజ కళాశాల, ఢిల్లీ జూనియర్ కళాశాల ఏరియాలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతోత్సవ సమితి బాధ్యులు పటేల్ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సమితి బాధ్యులు మాట్లాడుతూ దేశ సమైక్యత,సమగ్రత కోసం పాటుపడిన సర్దార్ వల్లభాయ్ పటేల్ జీవితస్ఫూర్తిదాయకమన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతోత్సవ సమితి నిర్వాహకులు బండ గోపాలరెడ్డి మాట్లాడుతూ సర్దార్ పటేల్ జి దేశానికి చేసిన సేవలను కొనియాడారు. సర్దార్ జయంతిని రాష్ట్రీయ ఏక్తా దివస్ గా ప్రభుత్వ నిర్వహించడం చాలా గర్వించదగ్గ విషయమన్నారు. సంస్థానాలను ఇండియన్ యూనియన్ లో విలీనం చేయడానికి సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన కృషిని స్థానిక విద్యార్థులకు ఈ సందర్భంగా తెలియజేశారు. అనంతరం రేకుర్తి -కొత్తపెల్లి రోడ్డు మార్గానికి సర్దార్ పటేల్ మార్గ్ గా నామకరణం చేశారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు నాగమల్ల సురేష్,ఢిల్లీ జూనియర్ కలశాల చెర్మెన్ సతీష్ రెడ్డి,వసుల శ్రావణ్,తొర్తి శ్రీనివాస్,నక్క ప్రమోద్,పుర ప్రముఖులు,విద్యార్థి నాయకులు,కార్మికనాయకులు,న్యాయవాదులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియమకాల అభ్యర్థులకు త్వరలోనే తీపి కబురు

-సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా...

-గత ప్రభుత్వంలో అన్యాయం జరిగిన మాట వాస్తవమే...

-టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్

కరీంనగర్, నవంబర్ 1: (నేటినిజం ప్రతినిధి) జిల్లా పరిషత్ కారుణ్య నియామక అభ్యర్థులకు గత ప్రభుత్వంలో అన్యాయం జరిగిందని, వారందరికీ సత్వర న్యాయం జరిగే దిశగా సమస్యను మంత్రులు దుద్దిల్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకు వెళ్తానని టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ హామీ ఇచ్చారు. కరీంనగర్ లోని టీఎన్జీవోస్ భవన్ లో దారం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో జెడ్పి కారుణ్య నియామక అభ్యర్థులు టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్ ను శుక్రవారం కలిశారు. త్వరలో జరిగే క్యాబినెట్ సమావేశ ఎజెండాలో, జడ్పీ కారుణ్య నియామకాల అంశాన్ని పొందుపరిచే విధంగా మంత్రులతో మాట్లాడనున్నట్టు ఆయన తెలిపారు. ఇప్పటికే ఈ విషయాన్ని పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినట్టు చెప్పారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న వారికి త్వరలో తీపి కబురు అందించనున్నట్లు

వెల్లడించారు. ఈ సందర్భంగా జెడ్పి కారుణ్య నియామక అభ్యర్థులు ఎన్జీవో సంఘ నాయకులు మారం జగదీశ్వర్, దారం శ్రీనివాస్ రెడ్డి లకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు అలుక కిషన్, జిల్లా కోశాధికారి ముప్పిడి కిరణ్ కుమార్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు సర్దార్ హర్విందర్ సింగ్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కోటా రామస్వామి, నోముల రాహుల్ రెడ్డి, భాగ్య, సతీష్ , రఘురాం రెడ్డి, సతీష్, విశాల్, నచ్చికేత్, పృథ్వీరాజ్, అజిత్, షాహెబాజ్, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ల సంక్షేమానికిచర్యలు: జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

– డ్రైవర్లకు 5లక్షల భీమా కల్పనకు కృషి

ఖమ్మం, నవంబర్ 1: (నేటినిజం ప్రతినిధి):ఆటో డ్రైవర్ల సంక్షేమానికి ప్రభుత్వం తరపున అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు.

శుక్రవారం కలెక్టర్, పాత డిఆర్డీఏ కార్యాలయ సందర్శన సందర్భంగా కార్యాలయ ఆవరణలో ఉన్న ఆటో డ్రైవర్ల వద్ద ఆగి, వారితో ఆర్థిక స్థితిగతులు, సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆటో డ్రైవర్లతో వారు ఎక్కడి నుండి ఎక్కడికి ఆటో నడిపేది, స్వంత లేదా కిరాయి ఆటో, రోజువారి సంపాదన, పిల్లలు ఏం చదువుతున్నది, ఎక్కడ చదువుతున్నది అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... గుర్తించిన ఆటో అడ్డాల వద్ద అవకాశం ఉన్న చోట కార్పోరేషన్ ద్వారా టాయిలెట్ల నిర్మాణం చేస్తామని అన్నారు. ఖమ్మం నగరంలో ఆటో డ్రైవర్లకు గుర్తింపు కార్డులు జారీ చేయాలని కలెక్టర్ అన్నారు. నగరంలోని ఆటో డ్రైవర్లకు 5లక్షల రూపాయల భీమా సౌకర్యం కల్పించడం జరుగుతుందని, డ్రైవర్ మరణించినా, ప్రమాదం బారిన పడిన, వైకల్యం వచ్చిన ఈ భీమా ఉపయోగపడుతుందని, దీని కోసం డ్రైవర్లు ప్రతి సంవత్సరం 500 రూపాయల వరకు చెల్లించాలని, దీనితో ప్రతి ఆటో డ్రైవర్ కు భీమా సౌకర్యం ఉండే విధంగా చర్యలు చేపడతామని అన్నారు. ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం తరపున ఎటువంటి సంక్షేమ పథకాలు వర్తిస్తాయి, వాటిని ఎలా పొందాలి, ఆరోగ్య సమస్యలు వస్తే ఆరోగ్య శ్రీ, ఆయుష్మాన్ భారత్, సీఎం సహాయ నిధి మొదలగు పథకాలను ఎలా వినియోగించుకోవాలి అనే అంశంపై అధికారులు అవగాహన కల్పిస్తారని కలెక్టర్ అన్నారు. ఒక కాలు లేని దారేడు గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ కొల్లు శ్రీనివాస రెడ్డిని కృత్రిమ కాలు గురించి అడిగారు. బరువు ఎక్కువగా ఉండడంతో కృత్రిమ కాలు అమర్చుకోలేదని తెలుపగా, కలెక్టర్ వివరాలు తెలుసుకొని, తేలికైన కృత్రిమ కాలు అమర్చుకోవాలన్నారు. ఆటో గేర్లు, నడిపే విధానం గురించి కలెక్టర్ ఆటోలో కూర్చొని పరిశీలించారు.

నవంబర్ 6 లోపు ప్రతి పట్టభద్రుడు విధిగా ఓటు హక్కును నమోదు చేసుకోవాలి

-కరీంనగర్ లో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ డాక్టర్ వి నరేందర్ రెడ్డి

కకరీంనగర్, నవంబర్ 1: (నేటినిజం ప్రతినిధి) రానున్న పట్టభద్రుల ఎన్నికల్లో తనను ఎమెల్సీగా ఆశీర్వదించి గెలిపిస్తే సేవకుడిగా పని చేస్తూ అందరికి అందుబాటులో ఉంటానని వెల్లడించారు..కరీంనగర్ పట్టణంలో పలు పాఠశాలలో ప్రచారం నిర్వహించి రానున్న ఎన్నికల్లో తనకు మద్దతు తెలిపాలని కోరారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి నాలుగు జిల్లాల వ్యాప్తంగా నిరుద్యోగులకు స్కిల్ డెవలప్మెంట్ కేంద్రాలు ఏర్పాటు చేస్తానని అన్నారు..స్కిల్ డెవలప్మెంట్ కేంద్రాల ద్వారా నిరుద్యోగుల్లో నైపుణ్యాలను పెంపొందించి వారు సులువుగా ప్రయివేట్, ప్రభుత్వ ఉద్యోగాలు సాధించే విధంగా అందులో శిక్షణ ఇప్పించేందుకు కృషి చేస్తానని అన్నారు... పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ బకాయిలను విడుదలకు కృషి చేస్తానని అన్నారు...ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ డీఏలను ప్రభుత్వంతో మాట్లాడి విడుదల చేయిస్తానని వెల్లడించారు... ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలుకు కృషి చేస్తానన్నారు... ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్, ప్రతి ఏడాది ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్లు ఇచ్చేలా కృషి చేస్తానని అన్నారు... గతంలో ఎమ్మెల్సీ పదవిని రాజకీయాల కోసమే వాడుకున్నారని అన్నారు.. ఎమెల్సీగా ఆశీర్వదిస్తే సేవకుడిగా పని చేస్తూ అందరికి అందుబాటులో ఉంటానని వెల్లడించారు... మోడల్ స్కూల్ టీచర్స్ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.. పోటీ పరీక్షలకు సిద్ధపడే అభ్యర్థులు గ్రంథాలయాలకు వెళ్లి అందరూ చదువుకోలేరు కాబట్టి వారి సౌకర్యార్థం ప్రత్యేక యాప్ ను రూపొందిస్తున్నామని వెల్లడించారు.. ఈ యాప్ లో దేశంలోని అన్ని పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే స్టడీ మెటీరియల్స్ అందుబాటులో ఉంటుందని తెలిపారు..


కథానిలయం వ్యవస్థాపకులు
కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత
100 Anniversary 1924-2024
శ్రీ॥శ్రీ॥ కాళీపట్నం రామారావు శతి జయంతి
తేది : 03-11-2024 ఆదివారం
ఉ॥ 10 గం॥ నుండి
సా॥ 4-30 గం॥ల వరకు
సెమినార్
వేదిక :
బాపూజీ కళామందిర్, శ్రీకాకుళం
ప్రారంభ సభ (ఉ॥ 10 గం॥ నుండి 11.30 ని॥ల వరకు)
అధ్యక్షులు : చీకటి దివాకర్, సాహితీ స్రవంతి, విజయనగరం
ముఖ్య అతిథి : గౌ॥ గొండు శంకర్, శాసనసభ్యులు, శ్రీకాకుళం
విశిష్ట అతిథి : ప్